RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 4 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | బుధవారం| ఏప్రిల్ | 8 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

## పాకిస్తాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్'

### చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం

పాకిస్తాన్ : ఇరాన్ యుద్ధం ప్రభావం పాకిస్తాన్‌పై గట్టిగా పడుతోంది. హార్మూజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్తాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధిస్తూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సీఎంలతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నాడు. చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని చెప్పాడు. 'స్మార్ట్ లాక్‌డౌన్' పై స్థానిక రేడియో వెల్లడించిన వివరాల ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్తాన్, ఇస్లామాబాద్, గిగ్లిత్ బల్తిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు.



కాల్పుల విరమణ ప్రతిపాదన తిరస్కరించిన

## ఇరాన్!

### రాత్రికి రాత్రే తుడిచిపెడతామని ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం రాత్రి వరకు గడువు విధిస్తున్నామని, ఆలోగా దిగిరాకపోతే ఇరాన్‌ను ఒక్క రాత్రిలోనే పూర్తిగా ఆక్రమించుకోగలమని, నాశనం చేయగలమని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈజిప్ట్, తుర్కియే, పాకిస్థాన్ దేశాలు మధ్యవర్తిత్వం వహించి రూపొందించిన 45 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. తాత్కాలిక విరామం శత్రువులు తిరిగి బలం పుంజుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, అందుకే తాము అంగీకరించబోమని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దీనికి బదులుగా, యుద్ధానికి శాశ్వతంగా ముగింపు పలకాలనే డిమాండ్‌తో పాటు మొత్తం 10 షరతులతో కూడిన ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా అమెరికాకు పంపినట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి.



బెంగాల్‌పై కన్నేస్తే..

## పాక్ ముక్కలే

- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్
- రెచ్చగొట్టే ప్రకటనలపై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్7 : పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్ప డ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నా థ్ సింగ్‌ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగా ల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతు డికే తెలియాలనిఅన్నారు. ఈవ్యాఖ్యలపైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశా రు. 1971లోజరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపో యి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది.నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబా ద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులోఎలాంటి దుస్సాహ సాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది.



## ఇరాన్ సుప్రీం లీడర్ ఆరోగ్యం విషమం

### అపస్మారక స్థితిలో మోజ్తబా ఖమేనీ!

డిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం అపస్మారక స్థితిలో (స్పృహలోలేరని) ఉన్నారని, దేశ పాలనా బాధ్యతలు నిర్వర్తించలేని స్థితిలో ఉన్నారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడు తున్నాయి. ఈ ఏడాది మార్చి నెలలో తన తండ్రి అయతు ల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత మోజ్తబా ఈ పదవిని చేపట్టారు. ప్రస్తుతం ఆయనకు టెహ్రాన్‌కు బదులుగా పవిత్ర నగరమైన కోమ్‌లో అత్యంత రహస్యంగా చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. భద్రతా కారణాలరీత్యా మో జ్తబాను అక్కడికి తరలించినట్లు నివేదికలు చెబుతున్నాయి. గత కొన్ని రోజులుగా మోజ్తబా బహిరంగంగా ఎక్కడా కనిపించకపోవడంతో ఆయన ఆరో గ్యంపై ఊహాగానాలు మొదలయ్యాయి. గత ఫిబ్రవరిలో తన తండ్రి అలీ ఖమేనీ మరణానికి కారణమైన వైమానిక దాడుల్లో మోజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారని, ఆ గాయాల ప్రభావం నుంచి ఇంకా కోలుకోలేదని గూఢచార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

తిరువనంతపురం, ఏప్రిల్7 :కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు.



విజయన్, మోడీ మంచి

## మిత్రులు

### కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు




పాకిస్తాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధించిన

## ప్రభుత్వం..

### చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం

పాకిస్తాన్ : ఇరాన్ యుద్ధం ప్రభావం పాకిస్తాన్‌పై గట్టిగా పడుతోంది. హార్మూజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్తాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధిస్తూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సీఎంలతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నాడు. చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని చెప్పాడు. 'స్మార్ట్ లాక్‌డౌన్' పై స్థానిక రేడియో వెల్లడించిన వివరాల ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్తాన్, ఇస్లామాబాద్, గిగ్లిత్ బల్తిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు. మార్కెట్లు, షాపులు, ఇతర కమర్షియల్ స్పేసెస్ అన్నీ రాత్రి ఎనిమిది గంటలకు మూసేయాలి.

ఐదు రాష్ట్రాల్లో

## ఎగ్జిట్ పోల్స్ నిషేధం

### 9వ తేదీ నుంచి 29 వరకు అమలు

### కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్7 : ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండిఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5.00గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.



## మణిపూర్‌లో రాకెట్ దాడి..

### ఇద్దరు చిన్నారుల మృతి

ఇంఫాల్: మణిపూర్ రాష్ట్రంలోని బిష్ణుపూర్ జిల్లాలో ఒక ఇంటిపైకి రాకెట్ దూసుకు వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా, తల్లి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన మంగళవారం ఉదయం మొయిరాంగ్ గ్రామంలోని ట్రింగ్లాబి అవాంగ్ లేకై అనే ప్రాంతంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, సమీపంలోని కొండ ప్రాంతం నుంచి దీనిని ప్రయోగించినట్లు భావిస్తున్నారు. ఇక్కడ పోస్టింగ్‌లో ఉన్న సరిహద్దు భద్రతా దళ అధికారి ఒయినం మలెంగాన్బా నివాసంపైకి ఈ రాకెట్ దూసుకువచ్చింది. ఘటన జరిగినప్పుడు అతని భార్య ఒయినం ఒంగ్బీ బినీతా(37), ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల్లో ఒకరు ఐదేళ్ల బాలుడు, ఐదు నెలల పసికందు ఇంట్లో ఉన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.వీరిని వెంటనే ఇంఫాల్‌లోని ఆసుపత్రికి తరలించగా, ఇద్దరు పిల్లలు చికిత్స పొందుతూ మరణించారు.



హైదరాబాద్ పాతబస్తీలో బెంగాలీలు

## ఉండలేని పరిస్థితి ఏర్పడింది

కేంద్రహోంశాఖ సహాయ మంత్రి

### బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ : హైదరాబాద్ పాతబస్తీలో శాంతిభద్రతలు క్షీణించాయని, అక్కడ బెంగాలీ కుటుంబాలు నివసించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీకి ఒక రూల్, ఇతర ప్రాంతాలకు మరో రూల్ అమలు చేస్తున్నారా? అని ముఖ్యమ ంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. నిన్న రాత్రి పాతబస్తీలోని బెంగాలీ కుటుంబాలతో బండి సంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాతబస్తీలో అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులపై ఎంఐఎం నేతలు దాడి చేసినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

అదే ఇతర ప్రాంతాల్లో బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే లాఠీఛార్జులు, కేసులు పెడుతున్నారని ఆయన గుర్తుచేశారు. 'ముఖ్యమంత్రి గారూ.. పాతబస్తీని ఏమైనా మజ్లిస్‌కు రాసిచ్చారా? ఎంఐఎం నేతలు దాడులు, దౌర్జన్యాలు చేసుకోవడానికి పర్మిషన్ ఇచ్చారా?' అని బండి సంజయ్ నిలదీశారు. ఎంఐఎం గూండాల కారణంగా బెంగాలీలు ఇబ్బందులు పడుతున్నారని, వేల సంఖ్యలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నగరంలోకి అక్రమంగా చొరబడి ఓటర్ కార్డులు కూడా పొందారని ఆరోపించారు. అధికారులపై దాడులు చేసేవారిపై చర్యలు తీసుకో కపోతే పాతబస్తీలో పరిస్థితులు చేయిదాటిపోతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలని అక్కడి బెంగాలీ సమాజాన్ని ఆయన కోరారు.



బీఆర్ఎస్ నాయకుల హౌస్ అరెస్టుపై..

## కేటీఆర్ అగ్రహం

### ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అంటూ ఫైర్

హైదరాబాద్,: బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇం ద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడు కోవాలని పోరాడుతున్న రైతులకు బాస టగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిప ంద చర్య అని ఆయన అభివర్ణిం చారు. ప్రశ్నించే గొంతులను పోలీసు ల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన మండిపడ్డారు.పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిం దని మండిపడ్డారు.

# అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

## - డీజీపీ శివధర్ రెడ్డి





**హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 07:** అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నింటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో అరీవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని,18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కోఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణంజరగాలని చెప్పు కొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. తీవ్రవాద ప్రాంతంలో ఇంత త్వరగా రోడ్లు వేయడం అభినందనీయమని అన్నారు. రోడ్లు వేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు..

# పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ పదవి మహిళలకు ఇవ్వాలి



**హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 07:** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే ఉత్సవ కమిటీలో మహిళలకు చైర్మన్, కో చైర్మన్ పదవులతో పాటు కమిటీలో అత్యధిక ప్రాధాన్యత కల్పించాలని బీసీ మహిళా సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు గంగాపురం పద్మ సీఎం రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మహిళా ప్రతినిధులతో మంత్రి పొన్నం ప్రభాకర్ను కలిసి వినతి పత్రం అందజేశారు. సామాజిక సమానత్వం, విద్యా వ్యాప్తి, మహిళల సాధికారత కోసం జ్యోతిరావు పూలే చేసిన సేవలు అపారమైనవని ఆమె పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే చూపిన మార్గంలోనే మహిళల అభివృద్ధి, సమాజ శ్రేయస్సు సాధ్యమవుతుందన్నారు. ఇందిరాగాంధీ దేశానికి తొలి మహిళా ప్రధానమంత్రిగా మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని, సోనియాగాంధీ మహిళల సంక్షేమం, సామాజిక న్యాయం కోసంచేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. వీరి స్ఫూర్తితో మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించడం ఎంతో అవసరమని అన్నారు. జ్యోతిరావు పూలే ఉత్సవ కమిటీలో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా బీసీ మహిళల సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో గడ్డమీది అనురాధ, బన్నీ దివ్య, లక్ష్మీ సౌజన్య, పి.అనురాధ, సిహెచ్.పద్మ, కె.వసంతమ్మ, చంద్రిక, సుజాత, అపర్ణ, ప్రజ్వల తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యంతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలం







**నారాయణగూడ, మహానది న్యూస్, ఏప్రిల్ 07:** నారాయణగూడలోని నారాయణ స్కూల్ ఈకిడ్స్ అండ్ ఈచాంప్స్ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు విద్యా ప్రస్థానంలో తొలి మెట్టును పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ఏజీఎం బాల పరమేశ్వర్, కోఆర్డినేటర్లు నూర్, రాధిక, ఆజాద్, ఆర్ అండ్ డి హెడ్‌లు మనోహర్, మీనా, ప్రిన్సిపాల్ వేషఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల పరమేశ్వర్ మాట్లాడుతూ విద్యతో పాటు ఒక నైపుణ్యం నేర్చుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే వ్యక్తిత్వ వికాసం కూడా అవసరమని, పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మంచి అలవాట్లు, విలువలు పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులదేనని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నూర్, రాధిక, ఆజాద్, మనోహర్, మీనా, వేషఖ తదితరులు పాల్గొన్నారు.

# ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడిగా గోపాల్ మిశ్రా

## - హర్షధ్వానాలతో అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నికకు ఆమోదం
## - అభినందనలు తెలిపిన తెలంగాణ నేత మామిడి సోమయ్య సహా పలు రాష్ట్రాల నేతలు



**న్యూఢిల్లీ, మహానది న్యూస్, ఏప్రిల్ 07:** ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ అధ్యక్షుడుగా ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన సీనియర్ జర్నలిస్టు గోపాల్ మిశ్రా ఎన్నికయ్యారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో గత సెప్టెంబర్ నెలలో ప్రారంభమైన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ సోమవారం న్యూఢిల్లీలో ముగిసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఎఫ్ డబ్ల్యూజే, అనుబంధ సంఘాల ప్రతినిధుల ఓటింగ్ ద్వారా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ప్రధాన ఎన్నికల అధికారి(సీఆర్ఓ) సంతోష్ చతుర్వేది (ఉత్తర ప్రదేశ్), సహాయ ఎన్నికల అధికారులు (ఏసీఆర్ఓ) మామిడి సోమయ్య (తెలంగాణ), మరూఫ్ రజా (ఢిల్లీ)తదితరులు ఈ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడి ఏకగ్రీవ ఎన్నికను న్యూఢిల్లీలోని నిజాముద్దీన్, బి-35 లో ఉన్న జర్నలిస్ట్స్ యూనియన్ ఆఫ్ ఢిల్లీ (జేయూడీ) ప్రాంగణంలో జరిగిన ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రకటించారు. గత సంవత్సరం వరకు అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ కే. విక్రమరావు మరణించడంతో ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపాల్ మిశ్రా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్టులు రెండు వైపుల నుంచి ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు.ఒకవైపు ఆదాయ వనరుల పతనం వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభం, మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వాడకం పెరగడం వల్ల న్యూస్ రూమ్ ల పనితీరు గందరగోళంలో పడిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులు అకారణంగా తమ జీవనోపాధిని కోల్పోకుండా చూడటం మన మొదటి కర్తవ్యమని అన్నారు. డిజిటల్ శ్రమ వాస్తవికతను ప్రతిబింబించే వేతన రక్షణను సాధించడం మన రెండవ కర్తవ్యమని గోపాల్ మిశ్రా అన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాబోయే రోజుల్లో పోరాటం చేస్తామని అన్నారు. ఏఐఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా హాజ రై, స్వర్గీయ డాక్టర్ విక్రమ్ రావును జర్నలిస్టుల శ్రేయస్సు కోసం అందించిన సేవలను కొనియాడారు.ఐఎఫ్‌డబ్ల్యూజే అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు గోపాల్ మిశ్రాను అభినందించారు. ఆయన తన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, డాక్టర్ కె. విక్రమ్ రావు చూపిన మార్గంలో నడవాలని కోరారు. నూతనంగా ఎన్నికైన ఐఎఫ్ డబ్ల్యూజే అధ్యక్షుడు గోపాల్ మిశ్రా 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా' 'నేషనల్ హెరాల్డ్' పత్రికలలో సీనియర్ సంపాదకీయ పదవులను నిర్వహించారు. భారతదేశపు మొట్టమొదటి ఇంటర్నెట్ న్యూస్ పోర్టల్‌ను ప్రారంభించారు. మాజీ రాష్ట్రపతి వి.వి. గిరిచే గుర్తింపు పొందిన పయనీర్ ఎంప్లాయీస్ యూనియన్‌ను స్థాపించారు. రెండు రోజుల పాటు జరిగిన ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సమావేశాల్లో సీనియర్ వర్కింగ్ కమిటీ సభ్యులు, జాతీయ ఉపాధ్యక్షుడు ఉపేంద్ర సింగ్ రాథోడ్, కోశాధికారి రజత్ మిశ్రా, కార్యదర్శులు పి. ఆనందం, కె. విశ్వదేవరావు, రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్ ఖాన్ (మధ్యప్రదేశ్) తదితరులు,ఢిల్లీ జర్నలిస్ట్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ




రాష్ట్రాలకు చెందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హసీబ్ సిద్ధిఖీ, దేవరాజ్ సింగ్ (ఉత్తరప్రద్దశ్), ప్రమోద్ దత్, సుధీర్ మధుకర్(బీహార్), సి. భూపతి(తమిళనాడు), భరత్ భూషణ్, దీపక్ కుమార్ (జార్ఖండ్), నమిత బోరా (అస్సాం), శాంత కుమారి, నారాయణ్ వైద్య(కర్ణాటక), ఓం ప్రకాష్ సింగ్, ముఖేష్ కుమార్ (మహారాష్ట్ర), బిజోయ్ పాల్ (త్రిపుర), అమిత్ రాయ్ (పశ్చిమ బెంగాల్), అరుణ్ శర్మ, ప్రయాగ్ పాండే (ఉత్తరాఖండ్), సీనియర్ పాత్రికేయులు ప్రేమ్ కాంత్ తివారీ, నితిన్ శ్రీవాత్సవ (ఉత్తరప్రదేశ్),వి. రవికుమార్ (టీడబ్ల్యూజేఎఫ్, హైదరాబాద్) తదితరులు కొత్త అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.




# నాంపల్లిలో నిరాశ్రయుల కోసం వైద్య శిబిరం - ఆరోగ్యంపై అవగాహన





**హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 07:** వీధుల్లో నివసించే వారు ఆరోగ్యాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. మెరుగైన జీవనానికి ఆరోగ్యమే పునాది అని ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన వైద్య, ప్రాథమిక అవసరాల శిబిరంలో ఆయన మాట్లాడారు. అమన్ వేదిక, నిరాశ్రయ శ్రామిక సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ శిబిరంలో నాంపల్లి పరిసర ప్రాంతాల నుంచి 113 మంది నిరాశ్రయులువైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన సేవలు పొందారు. వారికి దుస్తులు, ప్రాథమిక అవసరాల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, నిరాశ్రయులు ప్రభుత్వ పథకాలు పొం




దాలంటే గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ, అనిల్, రేణుక, రఘునాథ్, సురేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఇక పదవులే.. పదవులు

విజయవాడ, : రాజకీయం చేయాలంటే అవకాశాలు దక్కాలి. అవకాశాలు దక్కాలంటే రాజకీయం చేయాలి. అయితే ఉన్న పదవుల తక్కువ.. నేతలు ఎక్కువ అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే ఆంధ్రప్రదేశ్లో నియోజకవర్గాల పునర్విభజనతో కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీల సీట్లు మాత్రమే కాదు వందలాది పదవులు పుట్టుకొస్తాయి. వందలాదిమంది కొత్త ముఖాలు రాజకీయాల వైపు వస్తాయి. ఆర్థికంగా ఉన్నవారు.. పారిశ్రామికవేత్తలు ఇలా అందరూ రాజకీయాల వైపు రావడం ఖాయం. ఎందుకంటే గత 20 ఏళ్లుగా అదే జరుగుతోంది. ఇప్పుడు ఈ పదవుల పెంపుతో సైతం అదే జరగనుంది. ప్రస్తుతం ఏపీలో 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. పునర్విభజనతో మరో 80 సీట్లు పెరుగుతాయి. పార్లమెంట్ స్థానాలు 25 ఉన్నాయి. మరో 13 వరకు పెరగనున్నాయి. అయితే ఇప్పటివరకు ఎమ్మెల్సీలు ఏపీ నుంచి 52 మంది దాకా ఉండేవారు. వాటి సంఖ్య మరో 25 పెరగనున్నాయన్నమాట. రాజ్యసభ సీట్లు 11 ఉండేవి. అవి ఐదు నుంచి 6 వరకు పెరుగుతాయి. అయితే కేవలం నియోజకవర్గాల పునర్విభజన మాత్రమే కాదు. మున్సిపాలిటీలతో పాటు మండలాలు, పంచాయితీలు కూడా పెరుగుతాయి. అంటే టోటల్ గా వందలాది పదవులు లభించునున్నాయి కొత్తవారికి. అయితే ఇది కొత్తగా ఆశావహులకు చక్కటి అవకాశం కూడా.గత రెండు దశాబ్దాలుగా రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. అప్పట్లో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా చాలామంది నేతలు పార్టీల్లో చేరేవారు. పార్టీల్లో సేవలు అందించేవారు. వారి సేవలను గుర్తించి పదవులు ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదు. ఆర్థికంగా బలమైన వారికి అవకాశాలు దక్కుతున్నాయి. పార్టీ కోసం పని చేసే వారికి చాలా తక్కువ అవకాశాలు లభిస్తున్నాయి.

# తెలంగాణలో గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేయాలి

## – విశ్వహిందూ పరిషత్ డిమాండ్ – సీఎస్ రామకృష్ణారావుకు వినతిపత్రం సమర్పణ



హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 07: తెలంగాణ రాష్ట్రంలో గోరక్షణ చట్టాలను మరింత కఠినంగా, సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్ పీ) ప్రతినిధి బృందం మంగళవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వీహెచ్ పీ నాయకులు మాట్లాడుతూ.. గోమాత భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ ఆధారిత జీవన విధానానికి ప్రతీక అని పేర్కొన్నారు. గోవు కేవలం ఒక జంతువు మాత్రమే కాకుండా, భారతీయ జీవన తత్త్వంలో పూజనీయ స్థానం కలిగిన పవిత్ర ఆరాధ్యరూపం అని తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణా, అక్రమ వధ, చట్టవిరుద్ధ మాంస రవాణా వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గోరక్షణ చట్టాల అమలుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని,గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను నియమించాలని కోరారు.సరిహద్దు ప్రాంతాలు, హైవేలు, చెక్‌పోస్టుల వద్ద కఠిన తనిఖీలు చేపట్టాలని,అక్రమ వధశాలలు, అనుమతి లేని మాంస రవాణా కేంద్రాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. గో వధ, అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలని,గోశాలలకు ప్రభుత్వ పరిరక్షణ, మౌలిక సదుపాయాలు, ఆర్థిక సహాయం అందించాలని,గోరక్షణపై పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల సమన్వయం పెంచాలని వీహెచ్ పీ నాయకులు చీఫ్ సెక్రటరీ కి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. గోరక్షణ అనేది కేవలం మతపరమైన అంశం మాత్రమే కాకుండా, సాంస్కృతిక, ఆర్థిక, పర్యావరణ, వ్యవసాయ పరిరక్షణకు సంబంధించిన జాతీయ బాధ్యత అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గోమాత సంరక్షణ విషయంలో మరింత చురుకైన, కఠినమైన చర్యలు తీసుకుని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు.సానుకూలంగా స్పందించిన చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ.. గోహత్య నిషేధ చట్టాలను కఠినంగా అమలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు పగుడాకుల బాలస్వామి, రమేష్ , సుభాష్ చందర్, స్వామీజీలు దుర్గానంద, సర్వేశ్వర శివయోగి అంబిక, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కోతలే తప్ప కేటాయింపులేవీ?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మూడవ బడ్జెట్ ఆరు గ్యారెంటీలకు మంగళం పాడింది.. ప్రజా సంక్షేమానికి తిలోదకాలిచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలకు బడ్జెట్‌లో కొత పెట్టింది, కీలక రంగాలకు కేటాయింపులు తగ్గించింది. నిరుద్యోగభృతి, జాబ్ క్యాలెండర్, పీఆర్సీ ప్రస్తావనే చేయలేదు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల పట్ల తీవ్ర నిర్లక్ష్యమే కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ పట్ల సమాజంలోని అన్ని రంగాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. నమ్మి నానవోస్తే పుచ్చి బుర్రలైనట్టు గ్యారెంటీల గారడీతో మోసపోయామని ప్రజలు నెత్తీనోరు కొట్టుకుంటున్నారు.

కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో ఒక్క ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు. ఒక్క నిర్మాణం లేదు కానీ రూ.3.46 లక్షల కోట్ల అప్పులు మాత్రం చేసింది. కాంగ్రెస్ పాలకులు సృష్టించిన సమస్యలతో ప్రజలు కష్టాల పాలయ్యారు. తలసరి ఆదాయం రూ. 4,18,931 లేని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, ద్రవ్యోల్బణం ఎందుకు తక్కువగా ఉన్నదో చెప్పలేదు. కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కరోనా, నోట్ల రద్దు లాంటి ఆర్థిక సంక్షోభాలు ఎదురైనా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం ఆగలేదు. ఖర్చు కంటే సంపద పది రెట్లు వృద్ధి చెందింది. ఉద్యోగుల జీతాలు గణనీయంగా పెరిగాయి. తలసరి ఆదాయంతోపాటు కొనుగోలు శక్తి పెరిగి అనేక రంగాల్లో సంపద పంపిణీ జరిగింది. రైతుబంధు, భరోసా పథకాలు, నిరంతర విద్యుత్తు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటివి దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కేసీఆర్ పాలనలో కృష్ణా, గోదావరిలో తెలంగాణ నీటి వాటా వాడుకుంటూ అనేక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.4.17 లక్షల కోట్లు అప్పు చేసింది. ఇందుకు తగ్గట్టుగా సంపద సృష్టించి దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది. కానీ మాయమాటతో ఓసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచింది. కనీసం మూడో బడ్జెట్‌లోనైనా ఏమైనా కేటాయింపులు చేస్తుందేమో చూద్దామని అనుకున్న సబ్బండ వర్ణాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కానీ కాంగ్రెస్ మూడో బడ్జెట్‌లో వ్యవసాయ, సహకారశాఖలకు కేవలం రూ.23,179 కోట్ల అరకొర నిధులు కేటాయించింది. ఇందులో ఎంత ఖర్చు పెట్టేది ఎంతో అనే సందేహం ఉన్నది. రైతుబంధు పథకం కోసం రూ.13,593 కోట్లు కేటాయించారు. యాసంగి రైతులకు 70 లక్షల మంది రైతులకు కేవలం ఒక ఎకరాకు మాత్రమే చెల్లించారు. మిగతా రూ. 6000 కోట్లు వచ్చే నెలలో చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన రూ.7593 కోట్లు వానాకాలానికి సరిపోదు. అంటే ఏడాదికి ఒకే సారి రైతుబంధు ఇస్తామని ప్రభుత్వం పరోక్షంగా తేల్చిచెప్పినట్ట యింది. కేంద్రం సహకరిసున్నది అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్న ఇచ్చిందని ఎద్దేవా చేయడం ద్వంద్వనీతికి నిదర్శనం. హామీ మేరకు ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసింది. నిరుద్యోగులు ఆందోళన చేస్తే నిర్బంధాల ద్వారా అణచివేసే యత్నం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు 31,798 ఉద్యోగాల భర్తీ కోసం కేవలం 16 నోటిఫికేషన్స్ ఇచ్చింది. అందులో 16,978 మాత్రమే భర్తీ చేసింది. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్స్ ద్వారా ఇచ్చిన 50,785 ఉద్యోగాలు తమ ఖాతాలో వేసి, 67,763 ఉద్యోగాలు భర్తీ చేశామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. ఇక ఐదు డీఏలు బాకీ ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ కావడం విషాదం. డిజిటల్ హెల్త్ కార్డ్స్ పేరిట ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి. 1.5 శాతం కోత ద్వారా ఏడాదికి రూ.600 కోట్లు వసూలుకు సర్కార్ రంగం సిద్ధం చేసింది. మరి ప్రభుత్వం వాటాగా ఇవ్వాల్సిన రూ.600 కోట్లు ఇస్తుందో లేదో తెలియదు. రిటైర్ అయిన ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. 2024 మార్చి నుంచి రిటైర్ అయిన 24,678 మందికి రావలసిన రూ.10,000 కోట్ల పెన్షన్ బకాయిలు చెల్లించక పోవడం అమానవీయం. ప్రభుత్వ వైఖరితో 86 మంది రిటైర్డ్ ఉద్యోగులు అనారోగ్యం, మానసిక ఆందోళనతో మరణించారు. అసెంబ్లీలో బడ్జెట్ చర్చల్లో భాగంగా ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై బీఆర్ఎస్ పక్షాన హరీశ్‌రావు, కేటీఆర్ వాయిదా తీర్మానం ద్వారా ప్రశ్నిస్తే ప్రభుత్వం డొంక తిరుగుడు సమాధానాలు చెప్పింది. ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వైఖరి ఏంటో తేలిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్లలో రెండు పీఆర్సీలు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అమలు చేశారు. రిటైర్ అయిన ఉద్యోగులకు ఆరు నెలలలోపు పెన్షన్ బకాయిలు చెల్లించారు, పీఆర్సీ సకాలంలో వేసి 5 శాతం మధ్యంతర భృతి ఇచ్చారు. రాష్ట్రమంతా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పా టు చేసి మెరుగైన వైద్య సేవలు అందించారు. బీఆర్ఎస్ పాలనలో గణనీయంగా పెరిగిన త లసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి రేటు రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో తగ్గింది. గతి తప్పిన పా లననే ఇందుకు కారణం. సంపద పెంచి పేద ప్రజలకుపంచాలనే లక్ష్యంతో సాగిన కేసీఆర్ పాలనపై పదేపదే విమర్శలు, దుష్ప్రచారాలు చేయడం మినహా ప్రస్తుత పాలకులు చేస్తున్న అభివృద్ధి ఏమీలేదు. అన్ని వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి కోతలు విధించడం కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్‌లో ఉన్న ప్రత్యేకత. మూడు బడ్జెట్‌లు ముగిశాయి, మిగిలిన రెండు బడ్జెట్‌లపైనా ఆశలేదు. ప్రజావ్యతిరేకత పెల్లుబుకుతున్నా పట్టించుకోకుండా తప్పించుకుంటున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన సమయంలో తగిన బుద్ధి చెప్తారు.



## ప్రైవేట్ బస్సుల ప్రయాణికుల భద్రతకు ముప్పు

- నిబంధనలు పాటించని ప్రైవేట్ బస్సులపై చర్యలు ఎక్కడ?
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదంలో ప్రయాణికుల ప్రాణాలు
- సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి

భద్రాచలం/చర్ల ఏజెన్సీ ప్రాంతమైన చర్ల, భద్రాచలం నుంచి నడిచే ప్రైవేట్ వాహనాలు, ముఖ్యంగా ప్రయాణికులను తరలించే ప్రైవేట్ బస్సుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. అయితే, ఈ బస్సుల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి పట్టణాలకు ప్రతిరోజూ వందలాది మంది ఈ ప్రైవేట్ బస్సులపై ఆధారపడుతున్నారు. కానీ స్టాప్‌లు, పార్కింగ్ సౌకర్యాలు, సైనేజ్ బోర్డులు, సీసీటీవీ కెమెరాలు, టాయిలెట్లు, వెయిటింగ్ రూములు వంటి ప్రాథమిక వసతులు పూర్తిగా లేకపోవడం గమనార్హం. బస్సుల్లో పరిశుభ్రత కూడాసరిగా ఉండకపోగ ప్రయాణికులకు అందించే దుప్పట్లు ఎప్పటికప్పుడు ఉతికినవి ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా, ప్రమాదాల సమయంలో ఉపయోగపడే ఎమర్జెన్సీ ద్వారాలు సక్రమంగా పని చేయడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో అద్దాలు పగలగొట్టడానికి అవసరమైన హమర్లు కూడా అందుబాటులో లేవని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. 2026 మార్చి 30న భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు మార్గమధ్యంలో ప్రమాదానికి గురైన సంఘటన అందరికీ తెలిసిందే. ఆ సమయంలో ప్రయాణికులు ఎమర్జెన్సీ ద్వారాల ద్వారా బయటకు రావాలని ప్రయత్నించినా అవి తెరుచుకోలేదని వార్తలు విన్నాము. అద్దాలు పగలగొట్టేందుకు హమర్లు లేకపోవడం పరిస్థితిని మరింత విషమైంది. వెనుక భాగంలో ఉన్న అత్యవసర ద్వారం తెరిచినా అది బయటకు వెళ్లే మార్గంగా కాకుండా గదిలా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భద్రాచలం బస్ స్టాండ్ సమీపంలో ప్రైవేట్ బస్సులు రోడ్డుపక్కనే ఆగడం వల్ల ట్రాఫిక్ జామ్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. తెలంగాణ మోటార్ వాహన చట్టం 1988 (సెక్షన్ 93-99) ప్రకారం ప్రైవేట్ బస్సులకు నిర్దిష్ట ప్రమాణాలు, స్టాండ్లు ఉండాల్సి ఉన్నప్పటికీ అవి అమలులో లేవు. ఫలితంగా ప్రయాణికులు వర్షంలో తడుస్తూ, వేసవిలో ఎండలో నిలబ డాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ కారణంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ప్రయాణికుల ప్రాణ భద్రతదృష్ట్యా ప్రతి ప్రైవేట్ బస్సును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, నిబంధనలు అమలు చేయాలని, భద్రాచలం ఆర్టీవో, సంబంధిత అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

## కమలంలో కాసుల లొల్లి?




హైదరాబాద్ : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం అధిష్టానం పంపిన నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ పంపిన ఫండ్స్ పూర్తిస్థాయిలో అభ్యర్థులకు చేరలేదని, మధ్యలో ఆయా జిల్లాల బాధ్యులు సగానికి పైగా 'స్వాహా' చేశారని గుర్తించినట్లు సమాచారం. పలు రకాల సమీక్షల అనంతరం అగ్రనేతలు ఈ అంచనాకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. ముందుగా చెప్పిన ఓట్లు, సీట్లకు, ఫలితాలకు ఏ మాత్రం పొంతన కుదరకపోవడం తో.. అభ్యర్థుల ఓటమికి వీరే కారణమని భావిస్తున్నట్టు టాక్. ఈ నేపథ్యంలో ఫండ్స్ స్వాహా చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.లోక్ సభ ఎన్నికల్లో 36 శాతం ఓట్లతో బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుపొందింది. అంతేకా కుండా పార్టీకి ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు సైతం ఉన్నారు. పట్టణా ల ప్రాంతాల్లో బీజేపీకి పట్టు ఉన్నదని సర్వేల ద్వారా గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ భారీ ఆశలు పెట్టుకున్నది. గతంలో కంటే స్థానాలు పెరుగుతాయని, కొన్ని మేయర్, చైర్మన్లయినా కైవసం చేసుకుంటామని భావించింది. మహారాష్ట్ర మంత్రి ఆశీష్ షెలార్ కు కీలక బాధ్యతలు అప్పగించింది. అనంతరం ఎన్నికల కోసం భారీగా నిధులు సమకూర్చినట్లు తెలిసింది. అయితే ఫలితాలను చూసి నాయ కులు తీవ్ర నిరాశకు గురైనట్లు సమాచారం. దీంతో మున్సిపాలిటీలు, జిల్లాల వారీగా ఫలితాలపై పార్టీ సమీక్షించింది. కనీస స్థాయిలో కౌన్సిలర్లు, కార్పొరేటర్ స్థానాల్లో విజయం సాధించకపోవడం, చైర్మన్, మేయర్ స్థానాలను సైతం కైవసం చేసుకోవడంలో విఫలం కావడం పట్ల రాష్ట్ర నాయకత్వంపై అధిష్ఠానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా పార్టీ నాయకుల ద్వారా తెలిసింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డులు, డివిజన్లను బీజేపీ ఏ, బీ, సీ, డీ గా విభజించింది. విజయా వకాశాలు ఏ మాత్రం లేని వాటిని డీ కేటగిరిలో చేర్చింది. ఆ తర్వాత ఏ, బీ, సీ కేటగిరీల వార్డులకు కొంత మొత్తాన్ని నిర్ణయించి పార్టీ జిల్లా అధ్యక్షులకు నిధులు పంపించినట్లు నేతల ద్వారా తెలిసింది. అయితే ఆ నిధుల్లో వారు అత్యధిక శాతం నొక్కేసినట్లు చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఏ కేటగిరి డివిజన్లకు బీ, సీ కేటగిరి లకు నిర్ణయించిన మొత్తాన్ని అభ్యర్థులకు ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం గుర్తించినట్లు తెలిసింది. ఇలా పది మంది జిల్లా అధ్యక్షులు పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసినట్లు అంచనాకు వచ్చిన రాష్ట్ర నాయక త్వం.. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.ఉత్తర తెలంగాణలోని ఒక జిల్లాకు చెందిన మహిళా నాయకురాలిపై అక్కడి బీజేపీ నాయకులు రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. పార్టీ పంపించిన నిధులను అభ్యర్థులకు ఇవ్వకుండా స్వాహా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమెకు అక్కడి ముఖ్య ప్రజాప్రతినిధి మద్దతు ఉన్నట్లు తెలిసింది. ఉత్తర తెలంగాణలో ఉద్యమాల జిల్లాగా గుర్తింపు ఉన్న మరో జిల్లాలో రెండంకెల ఓట్లు రాని వార్డులను సైతం ఏ గ్రేడ్ గా చూపించి నిధులను మెక్కేసినట్లు పార్టీ గుర్తించింది. అక్కడ పార్టీకి అంత పట్టులేదని ఆ తర్వాత జరిగిన సమీక్షలో పార్టీ ముఖ్యనేత చెప్పినట్లు సమాచారం. దీంతో సంబంధిత బాధ్యుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కీలక నేతలు.. మొత్తం డబ్బులు కక్కాల్సిందేనని చెప్పినట్లు తెలిసింది. దీంతోపాటు మరికొన్ని జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిధులు స్వాహా చేశారని పార్టీ నాయకత్వం గుర్తించినట్లు సమాచారం.గతంలో బీజేపీలో ఉన్న క్రమశిక్షణ, నిబద్ధత ఇప్పుడు కరువయ్యాయని పాత కేడర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. అయితే డబ్బులు ఇచ్చి పదవులు తెచ్చుకున్నామని అంతర్గతంగా తమ అనుచ రులకు చెబుతున్న నేతలు.. వచ్చే ఎన్నికల వరకు తమకు ఖర్చులకు డబ్బులు కావాలి కదా అనే రీతిలో మాట్లాడుతున్నట్లు చర్చ జరుగుతు న్నది. అయితే నిధుల స్వాహాలో ముఖ్యంగా పది జిల్లాల బాధ్యులను గుర్తించగా.. వారిని తొలగించడం ఎంత వరకు సాధ్యమనే కోణంలో రాష్ట్ర నాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దాని కంటే ముందు వారికి నోటీసులు ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఇలాగే నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించగా.. మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇది రిపీట్ కావడంతో.. గట్టి చర్యలు తీసుకుంటేనే ఇలాంటివి పునరావృతం కావని అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతున్నది.

## జారుడుబల్ల..




భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ సర్కారు ప్రచారం ఉత్తదేనని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. ఎనిమిది ప్రధాన పరిశ్రమల ఉత్పత్తి సూచీ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో వృద్ధి మూడు నెలల కనిష్టానికి పడిపోయింది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ఏడాదిగా యుద్ధ మేఘాలు కమ్ముకున్నా... కేంద్రం నిర్లిప్తంగా ఉండటమే ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి. ఫిబ్రవరి 2026లో సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. ప్రస్తుత వృద్ధి రేటు 6.5 - 7 శాతం వద్దే కొట్టుమిట్టాడుతోంది. అది కూడా అంకెల గారడితోనే.. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదన. జిడిపి లెక్కల్ని ఐఎంఎఫ్ సైతం తప్పుబట్టడం మన గణాంకాలపై ప్రపంచానికి నమ్మకం లేదనడానికి నిదర్శనం.

స్టాక్ మార్కెట్‌కు గత ఆర్థిక సంవత్సరం 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. సోమవారం ఒక్కరోజే తొమ్మిది లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా- ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది. మార్చి నెలలోనే రూ.1.1 లక్షల కోట్లు (12 బిలియన్ డాలర్లు)పైగా విదేశీ సంస్థాగత పెట్టుబడులు (ఎఫ్ఐఐలు)ను పెట్టుబడిదారులు ఉపసంహరించుకున్నారు. అయినా విదేశీ పెట్టుబడులు వచ్చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఊదరగొడుతూనే ఉన్నారు. నరేంద్రమోడీ ఢిల్లీలో గద్దెనెక్కక ముందు 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియాలోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికే. ప్రభుత్వ లెక్కల్లో మొత్తం నిరుద్యోగిత రేటు 3.1 శాతం వద్ద ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ... పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) ప్రకారం.. దేశంలో పట్టభద్రుల నిరుద్యోగిత రేటు 11.2 శాతంగా ఉంది. గ్రామీణ పట్టభద్రుల్లో ఇది 11.8 శాతానికి చేరడం మరింత ప్రమాదకరం. ఈ ఆర్థిక వ్యవస్థ విద్యావంతులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. లేదంటే ప్రభుత్వ గణాంకాల బెలూను పగిలిపోయే రోజు ఎంతో దూరంలో లేదు.

## గృహ నిర్మాణదారులపై భారం

- యుద్ధంతో భారీగా పెరిగిన మెటీరియల్ ధరలు
- కొనుగోలుకు వెనకడుగు



కృష్ణా: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ చేస్తోన్న యుద్ధ ప్రభావం గృహ నిర్మాణ రంగంపైనా పడింది. రంగులు, టైల్స్, ఉపకరణాలు, పివిసి పైపుల ధరలు భారీగా పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తుల బై ప్రొడెక్టులతో వీటిని తయారు చేస్తారు. యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక డీజిల్‌పై లీటర్‌కు రూ.22 పెంచింది. గృహ నిర్మాణాల్లో అత్యంత కీలకంగా ఉపయోగించే పెట్రోలియం అనుబంధ ప్లాస్టిక్ ఉత్పుత్తుల ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు, సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారు, బిల్డర్లు ఆందోళన చెందుతున్నారు. ఆయా పరికరాల కొనుగోలుకు గృహ నిర్మాణదారులు వెనుకాడడంతో అమ్మకాలు తగ్గాయని వ్యాపారులు చెప్తున్నారు. రెండు వారాల్లో పది అడుగుల పొడవు, అంగుళం వ్యాసార్థం ఉన్న పివిసి పైపు ధర రూ.50 నుంచి రూ.70కు, 20 అడుగుల పొడవు, నాలుగు అంగుళాల డ్రెయినేజీ పైపు రూ.740 నుంచి రూ.1150కు, పివిసి పైపులకు ఉపయోగించే ఎల్‌బోలు, బెండ్‌లు, బాక్సలు 60 శాతం వరకు, ఆరు యాంప్స్ స్విచ్ రూ.22 నుంచి రూ.28కు, ఎలక్ట్రికల్ కేబుల్స్ (వైర్ కాయల్) ధర రూ.1,750 నుంచి రూ.2,100కు పెరిగింది. నాలుగు లీటర్ల పెయింట్ డబ్బా రూ.1,100 నుంచి రూ.1,200కు, తిన్నర్ (కర్పంటాయిల్) లీటరు రూ.100 నుంచి రూ.125కు చేరుకుంది. చెక్క పాలిష్ వేయడానికి అవసరమైన తిన్నర్ సరఫరాను కంపెనీలు నిలిపివేశాయి. డీలర్లకు స్టాక్‌లేదని కంపెనీలు చెబుతున్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి రంగులు, టిన్నర్ తదితరాల ధరలు మరో 15 శాతం వరకు పెంచుతున్నట్లు ఆయా కంపెనీల నుండి సెల్ ఫోన్లకు సందేశాలు వచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. గృహ నిర్మాణానికి ఉపయోగించే వివిధ రకాల మెరిటీయల్ ధరలు యుద్ధం వల్ల 20 శాతం వరకు పెరిగాయి. దీనికి ముందే ఇనుము ధర టన్ను రూ.63 వేల నుంచి రూ.75 వేలకు పెరిగింది. ప్రస్తుతం రూ.78 వేలకు చేరుకుంది. దీంతో, గృహ నిర్మాణం భారంగా మారింది.

కృష్ణా జిల్లాలో 16,511 మందికి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద గృహాలు మంజూరయ్యాయి.



## ప్రకృతి ప్రసాదం.. ఆరోగ్యానికి వరం

# తాటి ముంజులు





ప్రపంచీకరణ .. కార్పొరేటరీకరణతో ప్రకృతి ప్రసాదించే ప్రతి ఫలంలోనూ కల్తీ చోటు చేసుకుంటుంది. కానీ తాటి ముంజలు స్వచ్ఛతే సొంతం చేసుకుంది. మనకు ప్రకృతి ఇచ్చే పండ్లు, కాయలు ఎన్నో కల్తీలతో మార్కెట్‌లోకి వస్తున్నాయి. కొబ్బరి, మామిడి, సీతాఫలం, జామి, ద్రాక్ష ఇలా అన్నింటికి రసాయనాలు, ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. వాటిపై కార్పొరేట్ దృష్టి పడిన తర్వాత స్వచ్ఛమైనవి లభించడం లేదు. కొన్ని విషపూరితంగా మారుతున్నాయనడంలో సందేహం లేదు. కానీ ఇప్పటికీ తాటి ముంజు లు స్వచ్ఛంగానే లభిస్తున్నాయి. దీంతో ఆరోగ్య ప్రదాతగా విరజిల్లుతున్నాయి. వేసవి కాలంలో లభించే ఇవి ఎండలు, ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వీటి అమ్మకాలకు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం. ఇప్పుడు వీటికి హైదరాబాద్‌లోనూ గిరాకీ ఉంది.

కమాన్ పూర్, : కల్తీ లేనివి మందులు వాడనివి కేవలం తాటికాయలే.. వేసవి వచ్చిందంటే చాలు తాటి చెట్లకు కాయలు విరివిగా కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ తినాలనే తాపత్రయం పడుతుంటారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉండే తాటి ముంజులు ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో సైతం లభ్యమవుతున్నాయి. హైదరాబాద్ నడిబొడ్డులో కూడా వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం తాటి ముంజలు విక్రయిస్తున్నారు. ఏ కాలమైనా పెద్దగా ఇబ్బందులుండవు కానీ, వేసవి కాలం వచ్చిందంటే వేసవి తాపానికి భయపడతాం. ఓవైపు భానుడు భగభగ.. మరోవైపు రోడ్లన్నీ నిప్పుల కుంపటిని తలపించేలా సుర్రుమంటాయి. ఇళ్లలో నీడపట్టున కూర్చున్నా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతాం. కాలానికి తగ్గట్టు కమ్మని రుచులను వెంటబెట్టుకు వచ్చే తాటి ముంజలను తింటూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు.

తాటి ముంజ మజాయే వేరు..: వేసవిలో ఎన్ని పళ్లు తిన్నా.. శీతల పానీయాలున్నా.. తాటి ముంజల మజాయే వేరుగా ఉంటుంది. వీటికి ఉండే ఆదరణ అంతా ఇంతా కాదు. తాటి ముంజల ధర కూడా ఏమంత తక్కువ కాదు.. పట్టణ ప్రాంతాల్లో చాలా బాగా డిమాండ్ ఉంది. ఆరోగ్యాన్ని అందించడంలో కూడా తాటి ముంజలు ముందుంటాయి. వేసవిలో మాత్రమే లభించే వీటిని సిప్ చేయకుండా ప్రతి ఒక్కరూ తినాలనుకుంటారు. ప్రతి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పట్టణ ప్రాంతాల్లో తాటి ముంజలకు డిమాండ్ బాగా పెరిగింది. వేసవిలో మాత్రమే లభించడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేయడంతో తాటిముంజలను కొనుగోలు చేయడానికి నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.

**ఎన్నో లాభాలు:** అమ్మకం దారులు రోడ్డు పక్కనే కూర్చుని అమ్మడం మొదలు పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడు పోతున్నాయి. ప్రస్తుతం నగరల్లో ఒక ముంజ పది రూపాయలకు విక్రయిస్తున్నారు. తాటి ముంజల్లో విటమిన్ బి7, విటమిన్ , సోదెలుర్ ఫైబర్, పొటాషియం, కాల్షియం విసిమిన్- ఎ, ఎమిన్-డి విటమిన్- జింక్, ఐరన్ లతో పాటు న్యూట్రిన్స్ కూడా పుష్కలంగా ఉంటాయి. వేసవికాలంలో శరీరంలోని లవణ పదార్థాలు చెమట రూపంలో బయటకు వెళ్లిపోతాయి. దీంతో డీహైడ్రేషన్ ఏర్పడి జనం అస్వస్థతకు గురవుతారు. అందుకే ఎండాకాలంలో నీటిని ఎక్కువగా తీసుకోవాలని డాక్టర్లు చెబుతుంటారు. వేసవిలో శరీరానికి నీరు ఒక్కటే సరిపోదు. ఎన్నో రకాల జ్యూస్‌లు, పండ్లు తినాల్సి వస్తుంది. తాటి ముంజలు ఉంటే చాలు ఎంతటి ఎండ తీవ్రతకైనా అలసిపోకుండా యాక్టివ్ గా ఉంటారు. తాటి ముంజల్లో శరీరానికి అవసరమయ్యే మినరల్స్, షుగర్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని బ్యాలెన్స్‌డ్‌గా ఉంచుతాయి.

శరీరానికి చల్లదనాన్ని అందించడంలో అద్భుతంగా సహాయపడతాయి. వేసవి వల్ల ఒంట్లో పెరిగే వేడిని అమాంతం తగ్గించడంలో తాటి ముంజలు ముందుంటాయి. తాటి ముంజల్లో ట్యూమర్లను తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను డెవలప్ చేసే ఫైటోకెమికల్స్ అంథోసాయనిన్లను నిర్మూలిస్తాయి. వీటిని తరచుగా తీసుకుంటే క్యాన్సర్‌కు దూరంగా ఉండొచ్చు. తాటి ముంజల్లో విటమిన్లు, మినరల్స్, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

**అనేక రుగ్మతలకు చెక్:** నీటి శాతం ఎక్కువ, క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల అధిక బరువుకు చెక్ పెట్టవచ్చు. తాటి ముంజల్లో పొటాషియం ఎక్కువగా ఉండడంతో రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చు. పొటాషియం శరీరంలో ఉండే వ్యర్థాలను సమర్థవంతంగా తొలగిస్తుంది. కిడ్నీ లివర్ సమస్యలు కూడా దూరంగా ఉంటాయి. మలబద్దకంతో ఇబ్బంది పడేవారు తాటి ముంజెలు తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వేసవిలో వచ్చే వేడి వల్ల విరోచనాల సమస్య వస్తూ ఉంటుంది. తాటి ముంజలు తీసుకోవడం వల్ల సమస్యను పరిష్కరించవచ్చు. కడుపు ఉబ్బరం, కడుపులో వికారం, కడుపు నొప్పి, జీర్ణాశయ సమస్యలు కూడా దూరంగా ఉంటాయి. గర్భవతులకు కలిగే కండరాల తిమ్మిర్లు, అలసట తగ్గించడంలో తాటి ముంజలు బాగా సహాయపడతాయి. శరీరానికి మేలు చేసే పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వేసవి కాలంలో మన శరీరం నుండి చెమట బయటకు పోతుంది. శరీరంలోని పోషకాలు చెమట రూపంలో బయటకు పోతాయి. వాటిని భర్తీ చేయడానికి తాటి ముంజలు ఎంతో అవసరం.

**చలువ కోసం:** తాటి ముంజలో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో శరీరానికి కావాల్సిన శక్తి ఉంటాయి. కాబట్టి వేసవిలో చలువ కోసం తాటి ముంజల్ని తినడం చాలా అవసరం. కొంతమందికి ఎండాకాలంలో వేడికి ముఖంపై చిన్న చిన్న మొటిమల్లా వస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొందాలంటే కూడా తాటి ముంజల్ని తినాల్సిందే!

**నిర్జలీకరణం నుంచి ఉపశమనం..:** ఎండాకాలంలో ఎన్ని నీళ్లు తాగినా నిర్జలీకరణ అయిపోవడం సర్వసాధారణం. కాబట్టి ముంజల్లో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల వీటిని తింటే ఈ సమస్య నుంచి మనల్ని కాపాడుకోవచ్చు. వేసవిలో శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెరలను ఇవి సమతుల్యం చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా అవసరం. ఈ పండ్లు ఆకారంలో లీచీ పండును పోలి ఉంటాయి. రుచి లేత కొబ్బరిలా ఉంటుంది.

**గర్భిణులకూ మంచిదే..:** గర్భధారణ సమయంలో కొంతమందికి ఏది తిన్నా జీర్ణం కాకపోవడం లాంటి సమస్య ఎదురవుతుంది. అలాంటి వారు ముంజల్ని తినాలి. ఫలితంగా జీర్ణవ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాకుండా.. ఈ సమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ.. లాంటి ఆరోగ్య సమస్యల్ని కూడా దూరం చేస్తాయి.


**బరువునూ తగ్గిస్తాయి:** తాటి ముంజల్లో శరీరానికి కావాల్సిన ఎ, బి, సి విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్ఫరస్, పొటాషియం.. వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండటం వల్ల శరీర బరువును తగ్గించడంలో ఇవి ఎంతగానో తోడ్పడతాయి. అలాగే చికెన్‌పాక్స్‌తో బాధపడే వారికి దురద నుంచి ఉపశమనం అందించి, శరీరాన్ని చల్లగా ఉంచుతాయి.

**విషపదార్థాలు మాయం..:** తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యల్ని కూడా తగ్గిస్తాయి. ఈ పండులో అధిక మొత్తంలో ఉండే పొటాషియం మన శరీరంలో ఉండే విషపదార్థాలను తొలగిస్తుంది.

**వాంతులయ్యేలా ఉంటే..:** అధిక ఎండ వేడిమికి కొంతమందికి ఒక్కోసారి వాంతులయ్యేట్లు అనిపిస్తుంది. ఇలాంటప్పుడు నిమ్మరసం తాగుతారు. ఒకవేళ నిమ్మరసంతో ఎలాంటి ఫలితం లేకపోతే తాటి ముంజలు తినడం మంచిది. వెంటనే ఆ సెన్సేషన్ నుంచి ఉపశమనం పొందవచ్చు. వేసవిలో అలా కాసేపు బయటికి వెళ్లొస్తేనే అలసిపోతాం కదా! అంతేకాదు.. విపరీతమైన చెమట పోస్తుంది.. ఫలితంగా శరీరం అధిక మొత్తంలో నీటిని కోల్పోతుంది. ఈ క్రమంలో శరీరం కోల్పోయిన నీటిని అందించి, అలసట నుంచి ఉపశమనం పొందడానికి ఒక సులువైన మార్గం తాటి ముంజల్ని తినడం..

**క్యాన్సర్ల నుంచి..:** తాటి ముంజలు.. వివిధ రకాల ట్యూమర్స్, బ్రెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే ఫైటోకెమికల్స్, ఆంథోసయనిన్ లాంటి వాటిని నిర్మూలిస్తాయి. కాబట్టి ఈ పండుని ఎక్కువగా తినడం వల్ల క్యాన్సర్ల నుంచి కూడా దూరంగా ఉండొచ్చు. శరీరంలో గ్లూకోజ్ స్థాయినిపెంచి..శరీరానికి కావాల్సినమినరల్స్,న్యూట్రియంట్ల శాతాన్ని బ్యాలన్స్ చేయడంలో కూడా ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి.

# ఒత్తయిన జుట్టు కోసం



జుట్టు ఒత్తుగా నిగనిగలాడుతూ ఉండాలని ప్రతిఒక్కరూ ఆశపడతారు. కానీ, నేటి ఉరుకులు పరుగుల జీవితంలో జుట్టుపై శ్రద్ధపెట్టే సమయమెక్కడిదీ? జుట్టు సమస్యలకు ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలెన్నో. చాలామంది జుట్టురాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. హెయిర్ ప్యాక్‌లు, మసాజ్‌లు, రకరకాల చిట్కాలు పాటిస్తారు. ఒత్తయిన జుట్టుకోసం మీరూ ఓసారి ఇలా ట్రై చేయండి.


క్యారెట్: క్యారెట్ వెంట్రుకలను దృఢంగా ఉంచడంలో తోడ్పడుతుంది. దీనిలో విటమిన్ బీ7 పుష్కలంగా ఉంటుంది. దీన్నే బయోటిన్ అని పిలుస్తారు. ఇది జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. అందుకే దీన్ని ఆహారంలో భాగం చేసుకోవాలి. అలాగే క్యారెట్‌ని ఉపయోగించి తయారుచేసిన హెయిర్‌ప్యాక్‌ని అప్పుడప్పుడూ వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందచ్చు. దీనికోసం కొన్ని క్యారెట్ ముక్కలను తీసుకొని నీటిలో వేసి ఉడకబెట్టి మెత్తటి పేస్ట్‌లా తయారుచేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఈ ప్యాక్ వెంట్రుకలు రాలడాన్ని నియంత్రించి వాటిని దృఢంగా పెరిగేలా చేస్తుంది.

గ్రీన్ టీ: గ్రీన్ టీ తాగడంతో పాటు తలకు ప్యాక్‌లా పట్టించడం వల్ల కూడా జుట్టు రాలే సమస్యను తగ్గించుకోవచ్చు. దీనికోసం నాలుగైదు గ్రీన్ టీ బ్యాగ్‌లను.. అరలీటర్ నీటిలో వేసి వేడి చేయాలి. నీళ్లు చల్లారిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. తలస్నానం చేసిన తర్వాత ఈ నీటితో తలను బాగా తడపాలి. పది నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. ఇది మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది.

మందారం హెయిర్ ప్యాక్: ముందుగా మందార పూలను రెండు రోజుల పాటు ఎండలో ఆరబెట్టుకోవాలి. పూలతో పొడి చేసుకోవాలి. ఇప్పుడు మూడు టేబుల్ స్పూన్ల పెరుగులో ఓ టేబుల్ స్పూన్ మందారం పొడిని కలపాలి. ఇందులో రోజ్ మేరీ ఎస్సెన్స్ కూడా కలుపుకోవచ్చు. ఇది పింక్ రంగులోకి మారిన తర్వాత తలకు పట్టించి ఆరిన తర్వాత తలస్నానం చేయాలి.

# పర్పుల్ రంగు బెండకాయలను తింటున్నారా.. లేదా..

## తినకపోతే ఈ ప్రయోజనాలను కోల్పోతారు..!



బెండకాయలు మనం తరచూ తినే కూరగాయల్లో ఒకటి. వీటితో కూర, పులుసు, వేపుడు చేస్తుంటారు. చారులోనూ బెండకాయలను వేసి తింటారు. బెండకాయలు ఎంతో రుచిగా ఉంటాయి. వీటితో అనేక రకాల వంటకాలను చేయవచ్చు. అయితే బెండకాయల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. వాటిల్లో పర్పుల్ కలర్ బెండకాయలు కూడా ఒకటి. ఆకుపచ్చని బెండకాయల తరువాత మనకు ఇవే అధికంగా లభిస్తాయి. పర్పుల్ కలర్ బెండకాయల్లో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందువల్లే ఈ కాయలు ఆ రంగులో ఉంటాయి. ఆంథో సయనిన్స్ అనేవి యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. పర్పుల్ కలర్ బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

ఆర్థరైటిస్ నొప్పులకు..: పర్పుల్ రంగు బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ బెండకాయల్లోని ఆంథో సయనిన్స్ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వాపులు కూడా తగ్గిపోతాయి. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఈ బెండకాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ క్యాన్సర్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే క్యాన్సర్ కణాలు పెరగనీయకుండా అడ్డుకోవచ్చు. పర్పుల్ బెండకాయల్లో మ్యుసిలేజ్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జిగురు లాంటి పదార్థం. ఇది మన శరీరంలో చేరితే కొలెస్ట్రాల్‌కు అతుక్కుంటుంది. దీంతో కొలెస్ట్రాల్ తొలగించబడుతుంది. జీర్ణ వ్యవస్థ ద్వారా అది బయటకు వస్తుంది. దీని వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

షుగర్ ఉన్నవారికి..: ఈ కాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు ఈ బెండకాయలను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం పర్పుల్ రంగు బెండకాయలను తినడం వల్ల షుగర్ లెవల్స్‌ను సైతం తగ్గించుకోవచ్చు. ఈ కాయల్లో ఉండే పలు రకాల సమ్మేళనాలు ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తాయి. దీంతో శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా గ్రహిస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గిపోతాయి. ఈ కాయల్లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. అలాగే షుగర్ లెవల్స్ తగ్గేందుకు కూడా సహాయం చేస్తుంది.

అనేక విటమిన్లు, మినరల్స్..: పర్పుల్ కలర్ బెండకాయలలో అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఈ కాయల్లో విటమిన్ సి ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్ట పరుస్తుంది. వీటిల్లో ఉండే విటమిన్ కె గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం అవకుండా జాగ్రత్త పడవచ్చు. ఈ కాయల్లో ఉండే విటమిన్ బి9 (ఫోలేట్) గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. శిశువు ఎదుగుదలకు సహాయ పడుతుంది. ఈ బెండకాయల్లో ఉండే విటమిన్ ఎ రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు కంటి చూపును మెరుగు పరుస్తుంది. కణాలు నిర్మాణం అయ్యేలా చూస్తుంది. పర్పుల్ కలర్ బెండకాయల్లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతాయి. మెటబాలిజం సరిగ్గా ఉండేలా చూస్తాయి. ఇలా ఈ బెండకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# గర్భం దాల్చిన తొలి నాళ్లలో మహిళల్లో కనిపించే సంకేతాలు, లక్షణాలు ఇవే..!



గర్భం దాల్చడం అన్నది మహిళలకు మాత్రమే లభించిన ఒక గొప్ప వరం. ఈ క్రమంలోనే సంతానం లేని ఎందరో మహిళలు సంతానం పొందేందుకు ఆరాట పడుతుంటారు. ప్రస్తుతం చాలా మంది ఆలస్యంగా వివాహాలు చేసుకుంటున్నారు, దీనికి తోడు హార్మోన్ల సమస్యలు వస్తున్నాయి. కనుక చాలా మంది మహిళలు సంతానం పొందలేకపోతున్నారు. అయితే గర్భం దాల్చిన మహిళలకు మాత్రం మొదటి సారి అయితే లక్షణాలు సరిగ్గా తెలియవు. తాము గర్భం ధరించామని కూడా గుర్తించలేరు. కానీ శరీరం తెలియజేసే కొన్ని సంకేతాలు, లక్షణాలను పరిశీలిస్తే మహిళలకు తాము గర్భం దాల్చారో లేదో అన్న విషయం సులభంగా ఇట్టే తెలిసిపోతుంది. ఆ సమయంలో మహిళల్లో కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు కనిపిస్తాయి.

నొప్పులు..: గర్భం దాల్చిన మహిళల్లో చాలా వరకు మొదటి రెండు వారాల వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ కొందరికి మాత్రం పలు లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా శుక్రకణంతో ఫలదీకరణం చెందిన అండం గర్భాశయ గోడకు చేరుతుంది. ఆ సమయంలో కాస్త రక్త స్రావం అవుతుంది. పీరియడ్స్ వచ్చాక లేదా రావడానికి కొన్ని రోజుల ముందు ఇలా జరుగుతుంది. దీన్ని చూసి చాలా మంది మహిళలు నెలసరి సరిగ్గా రావడం లేదని భావిస్తారు. కానీ గర్భం దాల్చారు అన్న విషయాన్ని గుర్తించలేరు. గర్భం దాల్చిన మహిళలకు పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పుల లాంటి నొప్పులు వస్తాయి. దీంతో ఆ నొప్పులను పోల్చులేకపోతారు. ఇలా కూడా వారికి ఆ విషయం తెలియదు.

నీరసం, అలసట..: ఉన్నట్లుండి సడెన్‌గా నీరసం వస్తున్నా, తీవ్రమైన అలసటగా ఉన్నా, విశ్రాంతి తీసుకోవాలని అనిపిస్తున్నా అది గర్భం వచ్చిందన్న విషయాన్ని తెలియజేస్తుంది. అయితే కొందరు మహిళలకు హార్మోన్లలో వచ్చే హెచ్చు తగ్గుల కారణంగా కూడా ఇలా జరుగుతుంది. కనుక ఈ సమస్య ఉంటే డాక్టర్‌ను సంప్రదిస్తే పరీక్ష చేసి సరైన సమస్య నిర్ధారిస్తారు. దీంతో అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవ చ్చు. అలాగే గర్భం దాల్చిన మహిళల్లో కొందరికి స్తనాలు మృదువుగా మారి కాస్త వాపులకు గురైనట్లు అవుతాయి. ముట్టుకుంటే భారంగా అనిపిస్తాయి. కొందరికి ఆ భాగాల్లో సూదులతో గుచ్చినట్లు కూడా అనిపిస్తుంది. నిపుల్స్ ముదురు గోధుమ రంగులోకి మారుతాయి. ఈ లక్షణాలు కూడా ఉంటాయి..: గర్భం దాల్చిన మహిళలకు పీరియడ్స్ రావు. మహిళలు తమ పీరియడ్‌ను మిస్ అయితే గర్భం దాల్చారేమో చెక్ చేసుకోవాలి. ఇందుకు అవసరం అయితే టెస్టింగ్ కిట్‌ను వాడవచ్చు. కొన్ని సార్లు ఈ కిట్స్ ద్వారా సరైన ఫలితాలు రావు. కనుక డాక్టర్‌ను కలిసి పరీక్ష చేయించుకుంటే మంచిది. అలాగే మూత్ర విసర్జన తరచూ చేయాల్సి రావడం, వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం,

ఆహారం బాగా తినాలని అనిపించడం, మూడ్ మారుతుండడం, తలనొప్పి, మలబద్దకం, కడుపు ఉబ్బరం, శరీర ఉష్ణోగ్రతలో తీవ్రమైన హెచ్చు తగ్గులు వెంట వెంటనే రావడం, వాసన చూసే శక్తి పెరగడం, నోట్లో లోహపు రుచి అనిపించడం.. ఇవన్నీ గర్భం దాల్చారని తెలియజేసేసంకేతాలు.

## జనగణనలో సహజీవన జంటల విషయంలో..

# కేంద్రం కీలక నిర్ణయం




ఢిల్లీ,: దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణన-2027 ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం ఓ కీలక, విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. చాలాకాలంగా కలిసి జీవిస్తున్న (సహజీవనం) జంటలు తమ బంధాన్ని స్థిరమైనదిగా భావిస్తే, వారిని 'కుటుంబం'గా గుర్తించనుంది. ఈ మేరకు రాబోయే జనగణన నిబంధనల్లో స్పష్టతనిచ్చింది. జనగణనలో భాగంగా తొలిదశ అయిన 'ఇళ్ల జాబితా నమోదు', 'గృహ గణన' ప్రక్రియ 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరగనుంది. ఈ దశలో అధికారులు ప్రజలను 33 ప్రశ్నలు అడిగి వివరాలు సేకరిస్తారు. ఇందులో భాగంగా, వివాహిత జంటల సంఖ్యను నమోదు చేసేటప్పుడు సహజీవన జంటలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ మొదటి దశలో ఇంటి యజమాని వివరాలు, ఇంటి నిర్మాణానికి వాడిన సామగ్రి, తాగునీటి సౌకర్యం, విద్యుత్, వంటగ్యాస్ కనెక్షన్ వంటి వివరాలు సేకరిస్తారు. వీటితో పాటు ఇంట్లో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, వాహనాల వినియోగం, కుటుంబం ప్రధానంగా ఏ ఆహార ధాన్యాలు తింటుంది వంటి అంశాలపై కూడా ప్రశ్నలు ఉంటాయి.

ఈసారి జనగణన ప్రక్రియను డిజిటల్ పద్ధతిలోనూ నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు 'సెల్ఫ్-ఎన్యూమరేషన్' పోర్టల్‌ను అందుబాటులోకి తేనున్నారు. తొలి దశ పూర్తయ్యాక, 2027 ఫిబ్రవరిలో రెండో దశ అయిన 'జనాభా గణన' చేపడతారు. కులాల వారీగా గణన అంశంపై రెండో దశకు ముందే ప్రభుత్వం స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

## హైదరాబాద్ ప్రజలకు

# సూపర్ న్యూస్

## రోడ్లకు మహర్దశ.. తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు



హైదరాబాద్,: హైదరాబాద్ ప్రజలకు గుడ్ న్యూస్. నగరలో రోడ్ల మరమ్మత్తుల కోసం జీహెచ్ఎంసీ ముందడుగు వేసింది. అందులో భాగంగా నగరంలోని మూడు జోన్లలో రోడ్ల అభివృద్ధి పనులను చేపట్టేందుకు రంగం సిద్దమైంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ, సైబరాబాద్ నగర పాలక సంస్థ, మల్కాజ్‌గిరి నగరపాలక సంస్థ కలిసి నగరవ్యాప్తంగా రోడ్లకు మరమ్మత్తులు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆరు జోన్లకు రూ.150 కోట్ల నిధులు కేటాయించారు. అంటే ప్రతీ జోన్‌కు రూ.25 కోట్ల చొప్పున కేటాయింపు జరిగింది. ఈ బడ్జెట్‌తో అత్యవసర రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణణ్ ఆదేశాలు జారీ చేశారు. గుంతల రోడ్లను పూడ్చడంతో పాటు రోడ్లు సరిగ్గా లేని చోట సరిచేయడం వల్ల పనులు చేపడతారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది.

త్వరలోనే పనులు ప్రారంభం: రోడ్ల మరమ్మత్తుల పనుల కోసం ఇప్పటికే టెండర్లను ఆహ్వానించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇక కంప్రాహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం కింద 1045.01 కిలోమీటర్ల ప్రధాన రహదారులను రూ.3,145 కోట్ల ఖర్చుతో శాశ్వత ప్రాతిపాదికన అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పనులన్నీ పూర్తయితే నగరంలో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. ఇక సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. త్వరలోనే ఈ పనులను ప్రారంభించ నుండగా.. ఈ ఏడాదికల్లా పనులన్నీ పూర్తి చేయాలనే డెడ్ లైన్ పెట్టుకున్నారు. అయితే గతంలో హైదరాబాద్‌లో రోడ్ల పొడవు 9 వేల కిలోమీటర్లుగా ఉండేది. కానీ ప్రభుత్వం ఇటీవల 27 స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేసింది. దీంతో రోడ్ల పొడవు 14,787.66 కిలోమీటర్లకు చేరుకుంది. రూ.150 కోట్ల ప్రత్యేక నిధులు: నగర శివారు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు రచిస్తోంది. అయితే రోడ్ల అభివృద్ధి పనుల కోసం కార్పొరేట్లకు కేటాయించిన నిధులు కేవలం సీసీ రోడ్ల నిర్మాణానికే సరిపోతుంది. దీంతో మెయిన్ రోడ్ల నిర్మాణం జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ప్రధాన రహదా రుల నిర్వహణ సరిగ్గా లేవడం లేదని విమర్శలు వస్తున్నాయి.

# బెంగాల్‌లో కొత్త ట్రెండ్..

## ప్రత్యేక వివాహ చట్టం వైపు ముస్లిం జంటలు!

- పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక వివాహ చట్టం కింద ముస్లిం జంటల పెళ్లిళ్లు
- ఓటర్ల జాబితా సవరణపై ఆందోళనే ఇందుకు ప్రధాన కారణం
- బంగ్లాదేశ్, బిహార్ సరిహద్దు జిల్లాల్లో కనిపిస్తున్న ధోరణి
- గత ఏడాదిలో 1,130 దరఖాస్తులు, ఇటీవలి నాలుగు నెలల్లోనే 609
- సంప్రదాయ ఖాజీ సర్టిఫికెట్ కంటే ఎస్ఎంఏ సర్టిఫికెట్‌కే ఎక్కువ గుర్తింపు



కలకత్త: పశ్చిమ బెంగాల్‌లో ఒక కొత్త, అనూహ్య పరిణామం చోటుచేసుకుంటోంది. రాష్ట్రంలోని ముస్లిం జంటలు, ప్రత్యేకించి బంగ్లాదేశ్, బీహార్ సరిహద్దు జిల్లాల్లో, తమ వివాహాలను 'ప్రత్యేక వివాహ చట్టం-1954' (ఎస్ఎంఏ) కింద నమోదు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ముందుకొస్తున్నారు. సాధారణంగా మతాంతర వివాహాలు చేసుకునేవారులేదా సివిల్ పద్ధతిలో పెళ్లి చేసుకోవాలనుకునేవారు ఈ చట్టాన్ని ఆశ్రయిస్తారు. అయితే, రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలనపై ప్రజల్లో పెరుగుతున్న ఆందోళనలే ఈ మార్పుకు కారణమని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, నవంబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 మధ్య కాలంలో 1,130 ముస్లిం జంటలు ప్రత్యేక వివాహ చట్టంలోని సెక్షన్ 16 కింద తమ పెళ్లిళ్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సగానికి పైగా, అంటే 609 దరఖాస్తులు, కేవలం రావడం గమనార్హం. పొరుగున ఉన్న బిహార్‌లో కూడా ఇదే సమయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరగడం, ఇప్పుడు బెంగాల్‌లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ ధోరణి పెరిగింది. ఈ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా సరిహద్దు జిల్లాలైన ఉత్తర దినాజ్‌పూర్ (199), మాల్దా (197),ముర్షిదాబాద్ (185), కూచ్‌బెహార్ (97)లలోనే నమోదయ్యాయి. దీనికి విరుద్ధంగా, కోల్‌కతా వంటి పట్టణ ప్రాంతాల్లో కేవలం 24 దరఖాస్తులు రాగా, ఝర్‌గ్రామ్ (1), కాలింపాంగ్ (2) వంటి ప్రాంతాల్లో నామమాత్రంగా ఉన్నాయి. సాధారణంగా బెంగాల్‌లో ముస్లిం వివాహాలు 'బెంగాల్ మహమ్మదీయ వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టం-1876' ప్రకారం ప్రభుత్వంతో నియమితులైన ఖాజీల ద్వారా జరుగుతాయి. ఈ సర్టిఫికెట్లు చట్టబద్ధమైనవే అయినప్పటికీ, వాటి ఫార్మాట్లలో తేడాలు, చిరునామా ధ్రువీకరణలో స్పష్టత లేకపోవడం వంటి సమస్యలున్నాయి.

దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు వీటిని బలమైన గుర్తింపు రుజువుగా అంగీకరించడానికి వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. దీనికి భిన్నంగా, ప్రత్యేక వివాహ చట్టం కింద జారీ చేసే సర్టిఫికెట్ దేశవ్యాప్తంగా ఒకే ఫార్మాట్‌లో ఉండి, సర్వత్ర గుర్తింపు పొందింది. దీనిని మరింత అధికారికమైన, నమ్మకమైన పత్రంగా పరిగణిస్తారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా, అధికారులు 2002 నాటి జాబితాతో ప్రస్తుత వివరాలను సరిచూస్తున్నారు. వివరాలు సరిపోలకపోతే, అదనపు గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, బీహార్‌లో జరిగిన ప్రక్రియ బెంగాల్ సరిహద్దు ప్రజల్లో ఆందోళనను పెంచిందని, అందుకే తమ రాష్ట్రంలో పరిశీలన ప్రారంభం కాకముందే, ముందుజాగ్రత్త చర్యగా బలమైన, ప్రామాణికమైన వివాహ ధ్రువపత్రాన్ని పొందేందుకు వారు ప్రయత్నిస్తున్నారని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# సిటీలో వీధికుక్కలపై గ్రేటర్ అధికారుల దృష్టి




హైదరాబాద్: సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు.. హైదరాబాద్‌లో వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాలతో నగరంలోని ఆసుపత్రుల పరిసరాల వద్ద ఈ కార్యక్రమం మొదలైంది. తొలి రోజునే 277 కుక్కలను పట్టుకున్నారు. వీటికి స్టెరిలైజేషన్, టీకాలను ఇచ్చి.. జీహెచ్ఎంసీ సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు వంటి జనాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కుక్కల దాడులు పెరగడంతో.. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ చర్యలు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండటం విశేషం. జీహెచ్ఎంసీ కమిషనర్ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు.. వెటర్నరీ విభాగం సిబ్బంది వీధి కుక్కలను పట్టుకునేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ఈ డ్రైవ్‌ను ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించి అమలు చేస్తున్నారు.ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభమైన తొలి రోజునే, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల చుట్టు పక్కల ఏరియాల్లో ఏకంగా 277 వీధి కుక్కలను విజయవంతంగా పట్టుకున్నారు. ఆసుపత్రులలో రోగులు, సందర్శకులు ఎక్కువగా ఉంటారు కాబట్టి.. ఈ ప్రాంతాలకు ముఖ్య ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతను, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆసుపత్రుల వద్ద కుక్కలు తిరగడం వల్ల పరిశుభ్రత లోపించడంతో పాటు.. రోగులకు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నారు.పట్టుకున్న ఈ వీధి కుక్కలను కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించడం కాకుండా.. వాటి సంఖ్యను శాస్త్రీయ పద్ధతిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పట్టుకున్న కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ లేదా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. ఈ పద్ధతిని యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం అని కూడా అంటారు. దీనివల్ల వాటి సంఖ్య పెరగకుండా నివారించవచ్చు. శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత వాటిని జంతు సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. తిరిగి.. వాటికి టీకాలు ఇచ్చి, కొద్ది రోజుల పర్యవేక్షణ తర్వాత మాత్రమే పట్టుకున్న ప్రాంతంలోనే సురక్షితంగా విడిచిపెడతారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ నగర ప్రజలకు భరోసా ఇస్తూ.. తొలి దశలో ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, రవాణా కేంద్రాలపై దృష్టి సారించామని తెలిపారు. తదుపరి దశలో పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు వంటి ముఖ్యమైన పబ్లిక్ ప్రదేశాలు.. అలాగే పార్కులు, మార్కెట్ ప్రాంతాలలో కూడా ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని ప్రకటించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా.. ఏబీసీ పద్ధతిని పకడ్బందీగా అమలు చేస్తూ.. హైదరాబాద్‌ను కుక్కల బెడద లేని నగరంగా మార్చేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# ఆగని రజనీ రచ్చ!



గుంటూరు: పల్నాడు జిల్లాలో మాజీ మంత్రి విడదల రజిని పోలీసులపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత రెండు రోజులుగా తనను, తన అనుచరులను లక్ష్యంగా చేసుకొని పోలీసులు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా అన్యాయమని, ఇది చట్ట వ్యవస్థను అవమానించే పని అని ఆమె మండిపడ్డారు. చట్టానికి, వ్యవస్థలకు తమకు సంపూర్ణ గౌరవం ఉన్నప్పటికీ, పోలీసుల ప్రవర్తన మాత్రం రౌడీలు, గూండాలను తలపిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడుతున్న రజిని:. వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని తనపై, తన అనుచరులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడుతున్నారు. తనపై నమోదవుతున్న కేసుల నేపథ్యాన్ని వివరించిన రజిని, శ్రీ గణేష్ చౌదరి పేరుతో జరుగుతున్న ఫిర్యాదులు పూర్తిగా రాజకీయ నాటకమని అన్నారు. గణేష్ చౌదరి గత ఎన్నికల్లో దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో పాల్గొన్నాడని, ఈ విషయాన్ని ఫిర్యాదు చేసినవాళ్లే ముందే పేర్కొన్నారని ఆమె చెప్పారు. ఈ ఏడాది మార్చిలో దర్శిలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో కూడా గణేష్ టీడీపీ అనుచరుడని స్పష్టమైన పత్రాలలో ఉందని రజిని వెల్లడించారు. పదేళ్ల క్రితం తీసుకున్నట్లు చెప్పిన 35 లక్షల రూపాయల వ్యవహారాన్ని ఇప్పుడు తనపై తప్పుడు కేసులుగా మలచడానికి ప్రయత్నించడం ఎంతో విచారకరమని ఆమె అన్నారు. మాబు సుభాని టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని ఆరోపణ:. మాబు సుభాని అనే వ్యక్తి పల్నాడు ఎస్పీ కార్యాలయంలో తమపై ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావించిన ఆమె, అతను టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడని, అంతకుముందు చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో గణేష్‌తో రాజీకి వచ్చిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలను పట్టించుకోకుండా, ఒకవైపు ఫిర్యాదు పెట్టేలా, మరోవైపు కేసులు నమోదు చేసేలా పోలీసులు పనిచేస్తున్నారని రాజినిలు విమర్శించారు. పల్నాడు జిల్లాలో ఒక ఉన్నతాధికారి ఓ ప్రత్యేక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితులు వస్తున్నాయంటూ ఆమె ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే వెంటనే కేసులు పెట్టడం, యూనిఫామ్ వేసుకున్న పోలీసులు మూడు పార్టీలకీ అనుకూలంగా పని చేయడం వంటి వ్యవహారాలు చట్టపరమైన విధ్వంసానికే నిదర్శనమని ఆమె అన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి రజిని:. తన వ్యక్తిత్వ హననానికి డీఎస్పీ నేరుగా పాల్పడ్డారని, దీనిపై పరువు నష్టం దావా వేయడమే కాక హ్యూమన్ రైట్స్ కమిషన్, మహిళా కమిషన్‌లను ఆశ్రయిస్తానని రజిని ప్రకటించారు. రాజకీయంగా ఒక మహిళ ఎదగడం కొందరికి నచ్చడం లేదని, అందుకే తమ మీద తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపిం చారు.. టీడీపీ వాళ్లే ఫిర్యాదు చేసి, వాళ్ల ప్రభుత్వమే కేసులు పెట్టేలా చూస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ఎస్సీ, ఎస్టీతో సహా ఏడు కేసులు నమోదు చేసినా, వాటిని ఎదుర్కొనే ధైర్యం, న్యాయం తనవైపునే ఉందని ఆమె తెలిపారు. ఈ ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరగాలని ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు రజిని వెల్లడించారు.

# నిధులు విదల్చని కేంద్రం


- ఇవ్వాల్సింది రూ.32,284 కోట్లు.. ఇచ్చింది రూ.4,014 కోట్లే
- కూటమిలో ఉన్నా రాష్ట్రానికి మొరడిచేయే
- అర్ధ వార్షిక లెక్కలతో ఆందోళన



అమరావతి : ఎన్‌ఏ కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తూనే ఉంది. రాష్ట్రంలో డబుల్ ఇంకిన్ సర్కారు ఉందని చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన కనవడటం లేదు. కేంద్రం నుంచీ రాష్ట్రానికి రాణా ల్సిన గ్రాంట్లలో భారీ ఎత్తున కోత పడటమే దీనికి తాజా నిదర్శనం. ఈ సంవత్సరవు వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో 32,284 కోట్ల రూపాయిలు గ్రాంట్లుగా కేంద్రం నుండి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. దాదాపు బర్ధ సంవత్సర కాలం ముగుస్తుందగా ఇప్పటి వర కు వచ్చింది కేవలం నాలుగు వేల కోట్ల రూపాయలు మాత్రమే కావడం గమనార్హం. అంచనా వేసిన మొత్తంలో నాల్గవ వంతు కూడా లేకపోవడం అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా కేంద్రం ఇచ్చే గ్రాంట్లు కేంద్రం పన్నుల్లో వాటా నిధులే రాష్ట్రానికి కీలకంగా ఉంటాయి. ఈ నిధుల ఆధారంగానే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. అయితే, ఆ నిధుల్లోనే భారీగా కోత పడుతుండటం అధికారులన ఆందోళనకు గురిచేస్తోంది. వారు చెబుతున్న లెక్కల ప్రకారం రావాల్సిన మొత్తంలో కేవలం 12 శాతం మాత్రమే ఇప్పటి వరకు కేంద్ర నిధులు రాష్ట్రానికి అందాయి. అరునెలల కాలానికి 50 శాతం నిధులు రావాల్సిఉండగా, 25 శాతం కూడా రాకపోవడం గమనార్హం. కే oద్ర వనల్లో రాష్ట్ర వాటా కూడా ఇప్పటివరకు 42 శాతమే చేతికందింది. ఏడాది మొత్తానికి రూ.10,807 కోట్లు రావాల్సి ఉండగా, ఆర నెలల్లో రూ.17,187 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రం కీలకంగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని, కేంద్రంపై వత్తిడి తేలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. దీనిని అలుసుగా తీసుకుంటున్న కేంద్రం క నాదా నిధుల ఎగవేతకు పాల్పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన ఆదాయాన్ని చూసినా అన్ని రంగాల్లోనూ లక్ష్యాని కన్నా తక్కువగా నిధులు సమకూరాయి. పన్నేతర ఆదాయం కేవలం 13 శాతంగానే నమోదైంది.

ఆదాయ లోటు 140 శాతానికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు గ్రాంట్లు ద్వారా రూ.2.17 లక్షల కోట్లు వస్తాయ ని అంచనా వేయగా, 74 వేల కోట్లు మాత్రమే వచ్చాయి. అంచనా మేరకు కేంద్రం నుండి నిధులు కారపోవరంలో రూ.63 వేల కోట్లు రుణం తీసుకోవాల్సివచ్చింది. ఫలితంగా ఐడ్జెట్లో రూ.79,926 కోట్లు రుణం తీసుకోవాలని ప్రతిపాదించగా, ఆరు నెలల్లోనే 78 శాతానిడి పైగా రుణం సేకరించాల్సి వచ్చింది. దీంతో మిగిలిన ఆరు నెలలకు తీసుకునేందుకు అవకాశం ఉన్న రుణం కేవలం రూ.17 వేల కో ట్ల వరకు మాత్రమే ఉన్నట్లు తేలింది. భారీగా ఆదాయ లోటు:

ఆదాయం కన్నా వ్యయం ఎక్కువగా ఉండడంతో లోటు కూడా అదే స్థాయిలోకి చేరుకుంటోంది. ఈ ఏడాది ఆదాయ లోటు రూ.33,185 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, తొలి ఆరు నెలలకే రూ.46,652 కోట్లకు లోటు చేరుకోవడం గమనార్హం. ద్రవ్య లోటు రూ డా రూ.79,926 కోట్లు ఉంటుందని అంచనా వేయగా,ఇప్పటికే రూ.62 వేల కోట్లు వరకు పెరిగిపోయింది.



# రాత్రి పూట కొందరికి చిన్న శబ్దాలు కూడా పెద్దగా ఎందుకు వినిపిస్తాయి..?

చెవిలో ఉండే మైనం (ఇయర్‌వాక్స్) సహజంగా ఉత్పత్తి అవుతుంది. ఇది చెవి కెనాల్‌ను శుభ్రంగా ఉంచే, బ్యాక్టీరియాల నుంచి రక్షించే పదార్థం. ఇది చెవిని తడిగా ఉంచి రక్షణ కల్పిస్తుంది. సాధారణంగా డ్రై వాక్స్, వెట్ వాక్స్ అని రెండు రకాలుగా ఉంటుంది. అయితే ఇది అధికంగా పేరుకుపోతే జుచీ వైద్యుల సహాయం అవసరం అవుతుంది. ఎక్కువగా గులిమి పేరుకుపోతే వినికిడి తగ్గడం, చెవిలో బ్లాక్ అయిన భావన, నొప్పి, మోగుతున్న శబ్దం (రింగింగ్), తల తిరగడంవంటి సమస్యలు కలుగుతాయి. పగటి సమయంలో ట్రాఫిక్, మాట్లాడే శబ్దాలు, సంగీతం వంటి బాహ్య శబ్దాలు మనకు వినిపించే అసహజ శబ్దాలను(టిన్నిటస్) కప్పిపుచ్చుతాయి.కానీ రాత్రి సమయం లో నిశ్శబ్దం పెరిగే కొద్దీ ఈ శబ్దాలు మరింత స్పష్టంగా వినిపిస్తాయి. దీనిని ఆడిటరీ గెయిన్ అని అంటారు. అంటే మెదడు వినికిడి లోపాన్ని భర్తీ చేయడానికి తన సున్నితత్వాన్ని పెంచుతుందన్నమాట. దీనివల్ల చెవిలో వినిపించే శబ్దం మరింత తీవ్రంగా అనిపిస్తుంది.

మెదడు కార్యకలాపాలతో సంబంధం..: రాత్రి సమయంలో నిశ్శబ్ద వాతావరణంలో టిన్నిటస్ తీవ్రత పెరుగుతుంది. దీని వల్ల నిద్ర చక్రం దెబ్బతింటుంది. ముఖ్యంగా లోతైన నాన్-రెమ్ నిద్ర దశలు తగ్గిపోతాయి. ఫలితంగా ఉదయం అలసట, రక్తపోటు, ఆందోళన పెరగడం వంటి సమస్యలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇది ఇన్సోమ్నియా (నిద్రలేమి)కి కూడా దారితీస్తుంది. టిన్నిటస్ కేవలం చెవికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, ఇది మెదడు కార్యకలాపాలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. ఆడిటరీ, లింబిక్ వ్యవస్థల్లో అసాధారణ కార్యకలాపాలు మెదడును పూర్తిగా విశ్రాంతి పొందనీయవు. రాత్రి ప్రారంభంలో కొంత తగ్గినా, తర్వాతి గంటల్లో ముఖ్యంగా తేలికపాటి నిద్రలో మళ్లీ శబ్దం పెరుగుతుంది. రోజుకు సుమారు 8.5 గంటల నిద్ర అందేలా చూడడం టిన్నిటస్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. తక్కువ లేదా ఎక్కువ నిద్ర ఈ సమస్యను మరింత పెంచుతుంది. ఈ సమస్య ఉన్నవారు ఉదయాన్నే మత్తుగా ఉండడం, దృష్టి లోపించడం, నిద్రలేమి లక్షణాలు అనుభవించడం సాధారణంగా కనిపిస్తుంది.

సౌండ్ థెరపీ ఉపయోగకరం..: ఇక టిన్నిటస్ సమస్యను తగ్గించేందుకు సౌండ్ థెరపీ చాలా ఉపయోగకరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వైట్ నాయిస్ మెషీన్లు, ఫ్యాన్ శబ్దం లేదా వర్షం, సముద్ర అలల వంటి శబ్దాలు వినడం వల్ల చెవిలోని రింగింగ్ తగ్గుతుంది. ఇవి పగటి సమయంలో ఉన్న శబ్ద వాతావరణాన్ని అనుకరిస్తాయి. నిద్రకు ముందు సరైన అలవాట్లు కూడా కీలకం. నిద్రకు రెండు గంటల ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండాలి. బ్లూ లైట్ నిద్రను భంగం చేస్తుంది. మృదువైన లైటింగ్, హెర్బల్ టీ (కెఫీన్ లేకుండా), 4-7-8 శ్వాస వ్యాయామం (4 సెకన్లు లోపలికి శ్వాస, 7 సెకన్లు ఆపడం, 8 సెకన్లు బయటకు వదలడం) వంటి పద్ధతులు నాడీవ్యవస్థను ప్రశాంతం చేస్తాయి. తలను సుమారు 30 డిగ్రీల ఎత్తులో ఉంచి పడుకోవడం కూడా ఉపశమనం ఇస్తుంది. అలాగే కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (జుడీ) ద్వారా టిన్నిటస్‌పై స్పందనను మార్చుకోవచ్చు. గైడెడ్ సెషన్లు లేదా యాప్స్ ద్వారా ఈ శబ్దాన్ని నియంత్రించుకోవడం సాధ్యమవుతుంది.

జీవనశైలి మార్పులు అవసరం..: వీటితో పాటు జీవనశైలిలో కూడా కొన్ని మార్పులు చేసుకోవడం మంచిది. ఉప్పు, మద్యం వినియోగాన్ని తగ్గించడం మంచిది, ఎందుకంటే ఇవి టిన్నిటస్ తీవ్రతను పెంచుతా యి. భారీ వ్యాయామాన్ని పగటి సమయంలో చేయడం ఉత్తమం. శబ్దం అధికంగా ఉండే ప్రదేశాల్లో చెవులను రక్షించేందుకు ఇయర్ ప్లగ్స్ ఉపయోగించాలి. వినికిడి లోపం అనుమానం ఉంటే ఆడియో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. హియరింగ్ ఎయిడ్స్ వాడడం ద్వారా టిన్నిటస్ శబ్దం సుమారు 50 శాతం వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. చికిత్స లేకుండా టిన్నిటస్ కారణంగా వచ్చే నిద్రలేమి దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. స్ట్రోక్ ప్రమాదం, మానసిక సమస్యలు, దీర్ఘకాల అలసట, డిమెన్షియా వంటి సమస్యలతో కూడా సంబంధం ఉందని పరిశోధనలు సూచిస్తు న్నాయి. అయితే సరైన చికిత్స, జీవనశైలి మార్పులు, నిపుణుల మార్గదర్శకత్వంతో ఈ సమస్యను నియంత్రించుకోవచ్చు. ప్రశాంత మైన శబ్దాలతో నిద్ర వాతావరణాన్ని సృష్టించడం ద్వారా మెరుగైన నిద్రను తిరిగి పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# డాటాను తెగవాడేస్తున్నారు!

## 2025లో నెలకు దేశీయ సరాసరి డాటా వినిమయం 31 జీబీలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా డాటా వినిమయం వాయువేగంతో దూసుకుపోతున్నది. సరాసరిగా నెలకు సగటు భారతీయుడు 31 జీబీల డాటాను వినియోగిస్తున్నారు. 2024లో 27.5 జీబీల డాటాను వినియోగిస్తుండగా..ఆ తర్వాత ఏడాది 2025లో ఇది 10 శాతం ఎగబాకి 31జీబీలకు చేరుకున్నదని టెలికాం పరికరాల తయారీ దిగ్గజం నోకియా తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 13వ ఎడిషన్‌గా నోకియా వార్షిక మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్‌ను మంగళవారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా నెలవారీ 5జీ డాటా ట్రాఫిక్ 70 శాతం ఎగబాకి 12.9 ఎక్సాబైట్స్‌కి చేరుకున్నట్టు తెలిపింది. మొత్తం మొబైల్ బ్రాడ్ బ్యాండ్ యూజర్లలో 47 శాతం 5జీ యూజర్లే ఉన్నారు. 2025లో సరాసరి నెలవారీ మొబైల్ డాటా వినిమయం 31జీబీలకు చేరుకున్న దని, గడిచిన ఐదేండ్లలో సరాసరిగా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు వేగవంతంగా విస్తరిస్తుం డటం, ఏఐ అప్లికేషన్లు, 4కే వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్‌లకు ఉన్న డిమాండ్ వల్లనే డాటా వినిమయం ఊపందుకున్న దని పేర్కొంది. 5జీ సబ్‌స్క్రైబర్లలో ప్రపంచంలో రెండో స్థానంలో భారత్ నిలువగా, అలాగే 5జీ డాటా వినిమయంలోనూ, 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ కలిగివున్నవారిలో కూడా సెకండ్ ప్లేస్‌లో ఉన్నది.మెట్రో నగరాల్లో 5జీ అందుబాటులోకి రావడంతో ఇక్కడ వినియోగిదారులు భారీగా పెరిగారు. మొత్తం మొబైల్ వినిమయంలో ఈ వాటా 58 శాతానికి పైగా ఉన్నది. 2025 చివరినాటికి దేశవ్యాప్తంగా 89 కోట్ల 4జీ డివైజ్‌లు ఉ ండగా, 38.3 కోట్ల 5జీ డివైజ్‌లు ఉన్నాయి.

# పెందలాడే తింటేనే..



ఉదయం పెందలాడే నిద్ర లేవటం, రాత్రి పెందలాడే పడుకోవటం ఎంతో మంచిదని డాక్టర్లు తరచూ చెబుతున్నదే. ఇది భోజనానికీ వర్తిస్తున్నట్టు ఫ్రాన్స్ అధ్యయనం పేర్కొంటున్నది. ఉదయం 8 గంటలకు తొలి భోజనం (అల్పాహారం)తో ఆరంభించి రాత్రి 8 గం టలకు చివరి భోజనంతో తిండి తినటాన్ని ముగిస్తే గుండె, రక్తనా ళాలకు మేలు చేస్తున్నట్టు బయటపడింది మరి. రోజులో తొలి భోజనం ఆలస్యమవుతున్నకొద్దీ.. ప్రతి గంటకూ 6% చొప్పున గుండెజబ్బు ముప్పు పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఉదాహరణకు ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసేవారితో పోలిస్తే ఉదయం 9 గంటలకు టిఫిన్ తినేవారికి 6% ఎక్కువగా గుండెజబ్బు వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు తేల్చారు. ఇక రాత్రి 8 గంటలకు ముందే చివరి భోజనం చేసేవారితో పోలిస్తే రాత్రి 9 గంటల తర్వాత భోజనం చేసేవారికి గుండెజబ్బు ముప్పు 28% ఎక్కువగా ఉంటుండటం గమనార్హం. కాబట్టి ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఒక్కొక్కరి ఆహార అవసరాలు ఒక్కోలా ఉ న్నప్పటికీ వేళకు తినటం, భోజనానికీ భోజనా నికీ మధ్య తగినంత విరామం ఉండేలా చూసుకోవటం, పడుకునే ముందు మరీ ఎక్కువగా తినకపోవటం మంచిదని చెబుతున్నారు. అల్పాహారం, చివరి భోజనం పెందలాడే పూర్తి చేస్తే రాత్రి పూట తగినంత సేపు ఉపవాసం ఉన్నట్టు అవుతుంది. అలాగే త్వరగా, క్రమం తప్పకుండా, నిర్ణీత వేళల ప్రకారం ఆహారం తీసుకోవటం వల్ల శరీరంలోని వివిధ అవయవాల జీవగడియారాలు సమ్మిళితమవు తాయి. ఇవి రక్తపోటు వంటి గుండె జీవక్రియ పనితీరు మీద ప్రభావం చూపుతున్నాయని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ఫలితంగా గుండెజబ్బుల ముప్పు సైతం తగ్గుతున్నదన్నమాట.

# లివ్ ఇన్ రిలేషన్ షిప్ లో ఉంటే కుటుంబ హోదా..

హైదరాబాద్, : లివ్ ఇన్ రిలేషన్ షిప్‌లో ఉండే వారి పట్ల కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం సెన్సస్ నిబంధనల్లో కీలక మార్పులు చేసింది. దేశవ్యాప్తంగా జనగణన ? 2027 ప్రక్రియ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభవుతుంది. అయితే, ఈ జనగణనలో సహజీవన జంటలకు సైతం కుటంబ హోదా ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. చాలాకాలంగా కలిసి ఉంటున్న వారిని ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నట్లు తాజాగా కేంద్రం వెల్లడించింది.మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం జనాభా గణన ప్రక్రియ ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతుంది. రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇంటింటికీ వెళ్లి ఇళ్ల వివరాలు సేకరించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉ ంటుంది. జనగణన కోసం 33 ప్రశ్నలతో ఓ ప్రశ్నావళిని రూపొందించారు. రెండో దశలో లడఖ్ కేంద్ర పాలిత, జమ్మూకాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మంచుతో కప్పబడిన ప్రాంతాలు, అలాగే హించల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మినహా భారతదేశం వ్యార్తంగా జనాభా గణన ప్రారంభమవుతుంది. ఈ రెండు రాష్ట్రాల్లో ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తారురెండవ దశలో కుటుంబంలో వ్యక్తుల సంఖ్య, వారి పేర్లు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలస, వృత్తి, సంతానోత్పత్తి (వివాహిత మహిళల విషయంలో) వివరాలు సేకరిస్తారు. అదేవిధంగా ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు, గృహోపకరణాలు వంటి వివరాలను అడుగుతారు. తృణ ధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, పంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు.

# తమిళనాడులో మనీ కూపన్ల మాయాజాలం

చెన్నై, : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్రంలో 'మేనిఫెస్టో'ల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ విడుదల చేసిన డీఎంకే మేనిఫెస్టో, ప్రత్యర్థుల ఎత్తుగడలకు ఏమాత్రం తలొగ్గకుండా తన ద్రవిడ మోడల్ నమ్మకాన్నే ప్రతిఫలించింది. అన్నాడీఎంకే ఉచితాల వర్షం కురిపించినా, విజయ్ తన టీవీకే ద్వారా కొత్త ఆశలు రేపినా.. స్టాలిన్ మాత్రం తనదైన శైలిలో, అదనపు ఆకర్షణల కంటే ఆచరణాత్మక పాలనకే మొగ్గు చూపారుడీఎంకే మేనిఫెస్టోను సూపర్ స్టార్ గా అభివర్ణించిన స్టాలిన్, ప్రత్యర్థుల ఉ చితాలకు దీటుగా తనదైన శైలిలో ఇల్లత్తరసి అనే పథకాన్ని ప్రకటించారు ఆదాయ పన్ను పరిధిలోకి రాని గృహిణులకు ఏకంగా రూ.8,000 విలువైన కూపన్ అందజేస్తామని, దీనితో వారికి నచ్చిన వాషింగ్ మెషీన్, టీవీ లేదా ఫ్రిజ్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని వెల్లడించారు. అలాగే కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకం కింద ఇస్తున్న నగదును ?1,000 నుండి 2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రత్యర్థి పార్టీలు తన పాత పథకాలనే ప్రాతిపదికగా తీసుకుని పోటీ పడుతుండటంతో, తాను పెద్దగా పంథా మార్చుకోవాల్సిన అవసరం లేదని స్టాలిన్ బలంగా నమ్ముతున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన మేనిఫెస్టోలో ఉచిత రిఫ్రిజిరేటర్లు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం వంటి భారీ హామీలు గుప్పించారు. అయితే, స్టాలిన్ దీనికి భిన్నంగా ఎంపిక చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకే వదిలేశారు. ప్రభుత్వం నేరుగా వస్తువులు ఇచ్చే కంటే, ప్రజలే తమకు నచ్చిన వస్తువును కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా అవినీతికి తావులేకుండా చేయవచ్చని స్టాలిన్ భావిస్తున్నారు. అన్నాడీఎంకే ఉచితాల హోరును చూసి ఆయన ఏమాత్రం ఆందోళన చెందకుండా, తన పాత పథకాలనే స్కేల్-అప్ చేయడం ఆయన ధీమాకు నిదర్శనం.సినీ నటుడు విజయ్ తన తమిళగ వెట్రి కళగం మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి , డ్రగ్-ఫ్రీ స్టేట్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కొత్త ఓటర్లు, యువతను ఆకట్టుకోవడమే లక్ష్యంగా విజయ్ అడుగులు వేస్తుంటే, స్టాలిన్ మాత్రం నాన్ ముదల్వన్ పథకం ద్వారా ఇప్పటికే 5 లక్షల మంది యువతకు శిక్షణ, నెలకు 1,500 స్టైపెండ్ ఇస్తున్నామని గుర్తు చేస్తున్నారు. కొత్త పార్టీల రాకతో ఓట్లు చీలిపోయినా, తన డెలివరీ సిస్టమ్ ( బలంగా ఉ ండటంతో విజయం తనదేనని స్టాలిన్ ఫిక్స్ అయ్యారు. తమిళనాడు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, ప్రజల మద్దతుతో ఏడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థులు తనను అనుకరిస్తున్నారే తప్ప కొత్తగా ఏమీ చేయడం లేదన్నది ఆయన విశ్లేషణ. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌లో ఈ మేనిఫెస్టోల యుద్ధం ఎవరిని సింహాసనంపై కూర్చోబెడుతుందో చూడాలి.

# అదృశ్యమైన మహిళ దారుణ హత్య

## అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చిత్తూరు: పెద్దపంజాని మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ(35) అనే మహిళ దారుణ హత్యకు గురైంది. చంద్రమ్మ రెండు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి మహిళ కోసం గాలించగా.. పలమనేరు రూరల్ మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో చంద్రమ్మ మృతదేహం లభ్యమైంది. నగదు లావాదేవీలు కారణంగా ఈ హత్య జరిగినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత కొన్నే ళ్లుగా భర్తకు దూరంగా ఉ ంటోంది చంద్రమ్మ. పెద్దపంజానిలో టైలరింగ్ పని చేస్తూ చిట్టీల వ్యాపార లావాదేవీలు కొనసాగించేది. చంద్రమ్మ కనబడడం లేదని ఆమె బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో ఆమె హత్య విషయం వెలుగులోకి వచ్చింది. చంద్రమ్మ హత్య స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

# యనమల రిటైర్మెంటేనా..!



కాకినాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతగా, మేధావిగా, వ్యూహకర్తగా వెలుగొందిన యనమల రామకృష్ణుడు రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉ న్నట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఆయన, తాజాగా కాకినాడలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీశాయి. "పదవుల కోసం నేను ఎవరినీ సాయం కోరలేదు.. భగవంతుడు అనుకున్నదే మన జీవితంలో జరుగుతుంది" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, ఆయన రాజకీయ విశ్రాంతికి సంకేతాలా అనే అనుమానాలను బలపరుస్తు న్నాయి.టీడీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు యనమల రామకృ ష్ణుడు పార్టీలో అగ్రస్థానంలో ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చంద్రబాబుకు నమ్మిన బంటుగా, పార్టీకి ఆర్థిక, రాజ్యాంగ పరమైన అంశాల్లో దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం ముగిసే వరకు ఏదో ఒక పదవిలో ఉంటూనే ఉన్నారు. అయితే, ఎమ్మెల్సీ గడువు ముగిసిన తర్వాత పార్టీ అధిష్టానం ఆయనకు తదుపరి ఏ బాధ్యత అప్పగించలేదు.యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు తనకున్న అనుభవం ఉపయోగపడుతుందని ఆయన భావించారు. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా అధిష్టానం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టమవుతోంది. "రాజ్యసభ అడిగితే వచ్చేది కాదు.. మనం అనుకు న్నది భగవంతుడు చేయడు" అని యనమల అనడం వెనుక, తనకు పదవి దక్కదని ఆయన ముందే గ్రహించారా అనే చర్చ మొదలైంది. "ఇంకా నాకు పదవి ఇవ్వండి.. నేను పరిగెడతాను అని అడగలేను" అని చెప్పడం ద్వారా ఆయన తన అసహనాన్ని లేదా వైరాగ్యాన్ని ప్రదర్శించినట్లు కనిపిస్తోంది. యనమల రాజకీయ గ్రాఫ్ తగ్గడానికి ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ సెజ్ భూములపై ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఇది అధిష్టానానికి కొంత అసంతృప్తి కలిగించిందని సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన అల్లుడు ఒక డ్రగ్స్ కేసులో పట్టుబడడం యనమల ప్రతిష్ఠను దెబ్బతీసింది. రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయనకు, ఈ ఘటన వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది."పార్టీ మనుగడ కోసం శత్రువులకు కూడా సాయం చేశాను" అని యనమల అనడం ద్వారా పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూనే, తన సేవలకు తగిన గుర్తింపు లభించలేదనే ఆవేదనను వెలిబుచ్చినట్లు అనిపిస్తోంది. 44 ఏళ్లుగా పార్టీ తనను పోషించిందని చెప్పడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నప్పటికీ, భవిష్యత్తులో తనకు ప్రత్యక్ష రాజకీయ పదవులు ఉండకపోవచ్చనే వాస్తవాన్ని ఆయన జీర్ణించుకున్నట్లు తెలుస్తోంది.పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. టీడీపీ ఇప్పుడు యువ రక్తాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. సీనియర్లకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూనే, క్రియాశీలక పదవుల నుంచి వారిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే యనమలకు ఇక 'రాజకీయ విశ్రాంతి' తప్పదని ఆయన సన్నిహితులు సైతం గుసగుసలాడుకుంటున్నారు.మొత్తానికి, కాకినాడ వేదికగా యనమల చేసిన ఈ భావోద్వేగ వ్యాఖ్యలు ఒక సుదీర్ఘ రాజకీయ అధ్యాయం ముగింపునకు నాందిగా కనిపిస్తున్నాయి. అడగకుండానే పదవులను పొందిన యనమల, ఇప్పుడు అడిగినా దక్కని పరిస్థితిని ముందే పసిగట్టి గౌరవప్రదంగా తప్పుకోవడమే మేలని భావిస్తున్నారా? కాలమే సమాధానం చెప్పాలి.

# ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ: మంత్రి గురువారం ఉదయం ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్తో భేటీ కానున్నారు. పెండింగ్ లో ఉన్న పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులపై చర్చించనున్నారు. రూ. 430 కోట్ల విలువైన కేంద్ర పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రానికి వివరించనున్నారు. రాష్ట్రానికి మరో 9 కొత్త పర్యాటక ప్రాజెక్టులు కావాలని ప్రతిపాదించనుననారు.

స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ , శాస్కి పథకాల కింద ఐకానిక్ పర్యాటక కేంద్రాల అభివృద్ధి , ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ల బలోపేతంపై కేంద్రానికి డీపీఆర్ లు సమర్పిస్తారు. గతంలో కీలకమైన పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదం కోసం తీవ్ర ప్రయత్నాలు.. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం మంత్రి దుర్గేష్ చేసారు.

ప్రసాద్ స్కీమ్ క్రింద రూ.48.95 కోట్లతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని శ్రీ గృహ మల్లేశ్వర స్వామి ఆలయం,రూ.36 కోట్లతో కోరుకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, రూ.120 కోట్లతో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానాలకి నిధులు కోరనున్నారు

# నక్సలిజం ముగిసిన అధ్యాయమేనా?



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నక్సల్స్ రహిత భారతదేశం గడువుతో ముగుస్తుంది. కేంద్ర ప్రభుత్వం నక్సల్స్‌కు పెట్టిన డెడ్‌లైన్ మరో రెండు రోజులే మిగిలి ఉన్నది. ఆరు దశాబ్దాల క్రితం ఆరంభమై 22 రాష్ట్రాలకు విస్తరించి రోజూ ఎక్కడో చోట ఉద్యమ ఆనవాళ్లు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ సమీపంలోని బెంగాయిజోట్ గ్రామంలో 1967లో 25 మేన జరిగిన భూఉద్యమ పోరాటంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో తొమ్మిది మంది కార్మికులు, ఇద్దరు పిల్లలు మరణించడంతో నక్సలిజం మొదలైంది. అలా భూపోరాటం, సగటు మనిషికి కూడు, గూడు, గుడ్డ, గుప్పెడు న్యాయం నినాదంతో జనంలోకి వెళ్లింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ 1975 వరకు వేళ్లూనుకునే ఉన్నది. దొరలు, భూస్వాములు పటేల్, పట్వారీ వ్యవస్థల దోపిడీ విధానాల వల్ల ప్రజలు ఆర్థిక, మానసిక, శారీరక అసమానతలకు గురవుతున్న రోజులవి. అదే సమయంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లో చారు మజుందార్, కానూ సన్యాల్ సీపీఎం నుంచి విడిపోయి నక్సల్‌బరి నుంచి ఉద్యమం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎం నాయకులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకటయ్య తదితరులు నక్సలైట్ ఉద్యమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విస్తరింపజేశారు. 1969లో జరిగిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపింది. 1969లో జరిగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి సమర్థించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వందలాది మంది తెలంగాణ ఉద్యమకారులను కాల్చి చంపింది.

తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డి నాయకత్వ వైఫల్యంతో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్న తెలంగాణ యువత విప్లవోద్యమాలవైపు ఆకర్షితమైంది. 1969-70 నుంచే తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి, డాక్టర్ కొల్లూరి చిరంజీవి, ముప్పాల లక్ష్మణరావు (గణపతి) సీపీఐ-ఎంఎల్ పార్టీ ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రారంభిచారు, తెలంగాణలో విద్యార్థులు అధిక సంఖ్యలో నక్సలైట్లుగా మారడానికి వరవరరావు, గద్దర్‌తోపాటు విప్లవ రచయితల సంఘం ప్రచురణలు, గేయాలు, విప్లవ సాహిత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు యువతను ప్రేరేపించాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి హత్యానంతరం 1973-74లో విద్యార్థులు పీడీఎస్‌యూ పేరుతో సంఘటితమై ఉద్యమాలు రూపొందించారు. కొండపల్లి సీతారామయ్య, మల్లోజుల కోటేశ్వరరావు, నల్లా ఆదిరెడ్డి, శనిగరం వెంకటేశ్వర్లు (సాహూ), సూరపరెడ్డి జనార్దన్, నారదాసు లక్ష్మణరావు, అల్లం నారాయణ, అల్లం వీరయ్య, బీ విజయకుమార్ తదితరులు 1974 అక్టోబర్ 13న రాడికల్ విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ పేరును ప్రజాకవి శ్రీశ్రీ ఖరారు చేశారు.

దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో రాడికల్ విద్యార్థి సంఘాల ద్వారానే విప్లవ ఉద్యమాల పోరు జరిగింది. 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించింది. ఆ కాలంలో వందలాది మంది యువకులను పోలీసులు కాల్చి చంపారు, వేలాదిమంది యువకులు జైళ్ల పాలయ్యారు. వరంగల్ ఆర్ఈసీ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఆర్ఎస్‌యూ నాయకుడు సూరపనేని జనార్దన్, ఎల్బీ కాలేజీ విద్యార్థి లంక మురళీమోహన్‌రెడ్డిని 1975 జూలైలో సిద్దిపేట సమీపంలోని గిరాయిపల్లి గుట్టల్లో చెట్లకు కట్టేసి కాల్చి చంపారు. దేశంలోని ఆయా రాష్ట్రాలలో పేరు మోసిన ఉద్యమకారులను ఎంతోమందిని కాల్చి చంపారు. 1977 మార్చిలో ఎమర్జెన్సీ ఎత్తివేశాక అనేక ఘటనలు వెలుగు చూశాయి. 1978-79 ప్రాంతంలో మళ్లీ విప్లవకారులు పెద్ద ఎత్తున ఒక్కటయ్యారు. సభలు, సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తూ ఉద్యమాలకు మళ్లీ ఊపిరి పోశారు. స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి 33 ఏండ్లయినా వ్యవస్థలో ఏమాత్రం మార్పు రాలేదు. ఏ పేదవాడి కోసమైతే ఉద్యమాలు పుట్టాయో ఆ ఉద్యమాల ఆశలు, ఆశయాలు రవ్వంత కూడా నెరవేరలేదన్న ఉక్రోషంతో యువత మళ్లీ కదం తొక్కింది. జమీందారులు, జాగిర్దారులు, దేశ్‌ముఖ్‌లు, దొరలు, భూస్వాముల పీడ విరుగుడు కాలేదు. ప్రభుత్వం, పాలకులు, అధికార యంత్రాంగం వారికి పెంపుడు అనుకూలంగా మారటంతో ఉద్యమాలు పెల్లుబుకాయి. నక్సలైట్లు 1978లో 'గ్రామాలకు తరలండి' పేరుతో ప్రజల దీనస్థితిని తెలుసుకున్నారు.

1978 డిసెంబర్ 8న నిర్వహించిన జగిత్యాల జైత్రయాత్ర తర్వాత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమ పోరాటం మరింత పటిష్టమైంది. ఈ సభ తర్వాత కొండపల్లి సీతారామయ్య తన సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ(సీవోసీ)ని 1980 ఏప్రిల్ 22న పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ)గా మార్చారు. 1981 ఏప్రిల్ 20న పీపుల్స్‌వార్ ఇంద్రవెల్లి గిరిజన మహాసభలు తెలంగాణలో ప్రకంపన సృష్టించాయి. పోలీస్ కాల్పుల్లో దాదాపు 18 మంది మరణించగా వందలాదిమంది క్షతగాత్రులయ్యారు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తమ ఎన్నికల ప్రచారంలో నక్సలైట్లే దేశభక్తులని ప్రకటించారు. తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టారు. నక్సలైట్లు రాష్ట్రవ్యాప్తంగా తమ ఉద్యమాన్ని విస్తరిస్తూ మద్యపాన నిషేధం అమలు డిమాండ్ తీవ్రతరం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ మద్యపానం నిషేధాన్ని అమలు చేశారు. నక్సలైట్లు తమ డిమాండ్ల సాధన కోసం రాజకీయ నాయకులు, అధికారులు సిబ్బందిని కిడ్నాప్ చేశారు. పోలీసులు, నక్సలైట్లకు మధ్య పోరు తీవ్రమైంది. నక్సలిజాన్ని అణచివేసే క్రమంలో పోలీసులు నక్సల్స్ సానుభూతిపరులపై కేసులు పెడుతూ దాడులు చేస్తూ ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డారు. 1989లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నక్సలైట్లపై నిషేధం ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. ఆ పరిస్థితిని నక్సలైట్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. యువత పెద్దసంఖ్యలో నక్సలైట్లలో కలిసిపోయారు. ఎంతోమంది మహిళలు సైతం ఉద్యమంలో చేరారు. ఉత్తర తెలంగాణలో నక్సలైట్ల ఒత్తిడితో కొందరు భూస్వాములు, దొరలు తమ భూములను పేదలకు పంచారు. చాలామంది దొరలు, భూస్వాములు, బడా రాజకీయ నాయకులు గ్రామాలను వదిలి పట్టణాల్లో తలదాచుకున్నారు. చాలామంది నక్సలిజంలో చేరి తమ స్వార్థ ప్రయోజనాలు వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు పనులు చక్కబెట్టుకునేందుకు బెదిరింపులకు దోపిడీ దొంగతనాలు కూడా పాల్పడ్డారు. వారిని కట్టడి చేసేందుకు నక్సలైట్లు కొందరిపై హింసాత్మక చర్యలకు దిగారు. సీపీఐ (ఎంఎల్), పీడబ్ల్యూజీ, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ) తదితర ఉద్యమ పార్టీలన్నీ ఏకమై 2004 సెప్టెంబర్ 21న సీపీఐ మావోయిస్టు పార్టీగా అవతరించాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2005లో నక్సలైట్లతో శాంతి చర్చలకు పిలుపునిచ్చారు, చర్చలు విఫలమయ్యాయి. నక్సలైట్లపై ప్రభుత్వం మళ్లీ నిషేధం అమలు చేస్తూ క్రమంగా నక్సలైట్లపై తీవ్ర ఒత్తిడి పెంచింది.

2006 నుంచి 2014 వరకు మలిదశ తెలంగాణ ఉద్యమం తీవ్రతరమైంది. కేసీఆర్ చేపట్టిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి నక్సలైట్లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను ప్రేరేపించి ఉద్యమానికి సన్నద్ధం చేశారు. అప్పటికే పోలీసు బలగాలు నక్సలైట్లపై అన్ని రకాలుగా అణిచివేత ధోరణితో ఎన్‌కౌంటర్లను తీవ్రతరం చేశారు. నక్సలిజంలోకి రిక్రూట్‌మెంట్ పూర్తిగా ఆగిపోయింది. దళ నాయకులు, కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వదిలి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు వెళ్లారు.

నక్సలిజాన్ని పూర్తిగా రూపుమాపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఏర్పాటు చేసి 50 వేల మంది సైనికులను రంగంలోకి దింపింది. అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు సాంకేతిక నైపుణ్యంతో చర్యలు చేపట్టింది. రెండేండ్లుగా నక్సల్స్‌కు, పోలీసు బలగాలకు భీకరపోరు జరుగుతూనే ఉన్నది.

నిరుడు మే 21న జరిగిన పోలీస్ కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 21 మంది కీలక నేతలు హతమయ్యారు, అక్టోబర్ 6న మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తోపాటు పలువురు కీలక నేతలు లొంగిపోయారు, 2017 నుంచి ఇప్పటివరకు దాదాపు పదివేలకు పైగా నక్సలైట్లు లొంగిపోగా వేల మంది హతులయ్యారు. వరకు నక్సల్స్ రహిత దేశంగా మారుస్తామని కేంద్రం తీసుకున్న భీష్మ శపథానికి మరో మూడు రోజులే గడువున్నది. ఆది నుంచి నక్సలిజంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటుతో పూర్తిగా నక్సలిజం తుడిచి పెట్టినట్టు అవుతుందని కేంద్రం భావిస్తున్నది. ఆయన భారతదేశంలో ఉన్నారా? విదేశాల్లో ఉన్నారా? అన్నది పోలీసులు విచారణ చేస్తున్నారు. త్వరలోనే ఆయనను లొంగిపోయాలా చేయాలన్నది పోలీసుల ప్రయత్నంగా కనిపిస్తున్నది. ఈ మూడు రోజుల్లో నక్సల్స్‌ను పూర్తిగా నిర్మూలించినట్టు కేంద్ర ప్రకటిస్తుందో లేదో వేచి చూడాలి.

# జగిత్యాల జిల్లాలో భారీ వర్షం

## గోడ కూలి డిజైర్ కారు ధ్వంసం

జగిత్యాల: తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలు కురిసాయి. ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి చాలా చోట్ల తీవ్ర పంట నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన పంట నేలరాలడంతో లబోదిబోమంటున్నారు రైతులు. ఉదయం కురిసిన వర్షం కారణంగా జగిత్యాల జిల్లాలో గోడ కూలి కారు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా కోరుట్లలో వర్షం కారణంగా గోడ కూలి రాజేష్ అనే వ్యక్తికి చెందిన డిజైర్ కారు ధ్వంసం అయ్యింది. కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెంది న రాజేష్ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో తన కారు పార్క్ చేశాడు. ఉదయం కురిసిన వర్షానికి ఇంటి రెండో అంతస్తుకు సంబంధించిన ప్రహరీ గోడ కూలి కారు మీద పడింది. రెండో అంతస్తు నుంచి గోడ కూలి పడటంతో కారు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఇష్టపడి కొన్న కారు పూర్తిగా ధ్వంసం అవ్వడంతో లబోదిబోమంటున్నాడు బాధితుడు.

# మహాలక్ష్మి ఆలకించు ఉచిత జర్నీ

## బస్సులు సరిపోక అవస్థలు



కొడిమ్యాల: మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకంతో బస్సుల్లో రద్దీ పెరిగి ప్రయాణికులతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు సైతం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా నిత్యం ప్రయాణం చేసే ఉద్యోగులు, విద్యార్థులు, పలు పనుల నిమిత్తం వెళ్ళే ప్రయాణికులు బస్ జర్నీ అంటేనే జంకుతున్నారు. ఈ ఉచిత ప్రయాణంతో ముఖ్యంగా పుణ్యక్షేత్రాలకు, షాపింగులు ఇతరత్రా కారణాలతో వెళ్ళే ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. బస్సుల్లో సీట్ల కోసంతో పాటు నిలబడడంకోసం ఒకరికొకరు గొడవలు పడుతున్న సంఘటనలు పలుచోట్ల సంతరించుకుంటున్నాయి. సోషల్ మీడియా ముఖంగా ఇలాంటి సంఘటనలను సంబంధిత డిపో అధికారుల నుండి మొదలు రాష్ట్రస్థాయి ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకుపోతున్నా కూడా వారు నిమ్మకు నీరెత్తినట్లుగా.. ఉచిత జర్నీ విషయంలో తగ్గేదేలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లలో క్రమేణా బస్సుల సంఖ్యను పెంచాలని లేదా మహాలక్ష్మీ ఉచిత బస్సు ప్రయాణ పథకంకు ప్రత్యేక బస్సులను నడపాలని ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రయాణికులు కోరుతున్నారు.

# జిల్లా లో 20% ప్రమాదాల మరణాలను తగ్గించడమే లక్ష్యం

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, : జిల్లాలో గణనీయంగా ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం నూతన విధానాలతో ప్రజలలోకి వెళ్తూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తుంది. అందులో భాగంగానే ఆదిలాబాద్ పట్టణం నుండి మహారాష్ట్ర- మాండ్వి (కిన్వట్) కి వెళ్లే రహదారిపై రాంపూర్ రోడ్డు ప్రారంభం నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 40 సూచిక బోర్డులను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగానే తాంసి మండలం పొన్నారి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డు లను ప్రారంభించడం జరిగింది. ఆదిలాబాద్ నుండి మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారులలో ఒకటైన ఈ జాతీయ రహదారి పై సూచిక బోర్డులను ఏర్పాటు చేసి గణనీయంగా ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు వ్యవస్థ కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే కల్వట్ల వద్ద, క్రాసింగ్ వద్ద, బ్రిడ్జిల వద్ద, గ్రామాల వద్ద మరియు ప్రమాదకర మూల మలుపుల వద్ద వాహనదారులకు అర్థమయ్యేలా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది.

# కేయూ హాస్టల్‌లో ఎలుకల బెడద..!

## 14 మంది కరిచినా పట్టించుకోని అధికారులు..?

హనుమకొండ: హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ హాస్టల్‌లో ఎలుకల బెడద కలకలం సృష్టిస్తుంది. కేయూలోని సమ్మక్క సారక్క హాస్టల్‌లో 14 మంది విద్యార్థులను ఎలుకలు కరిచాయి. మరోవైపు మందుల కోసం యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్తే మందులు లేవని వెనక్కి పంపించేస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి దుస్థితి ఏర్పడింది. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంపపై వర్సిటీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలుకల బెడదపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. హాస్టల్‌లో ఉండాలంటేనే భయంతో వణికిపోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# సమస్యల పరిష్కారానికే ప్రత్యేక సభలు

**- పకడ్బందీగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి**
**- షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలి**
**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల : ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఏప్రిల్ 2వ తేదీన గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణపై జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ, వార్డులో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభలు నిర్వహిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రాలు సిద్ధం చేసి పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలో అభివృద్ధి అవసరాలు గుర్తించి, సమస్యలను చర్చించి పరిష్కారాలపై నిర్ణయాలు తీసుకోవాలని, ఇప్పటివరకు చేపట్టిన పనులు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వివరాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. సభలకు సర్పంచ్, చైర్‌పర్సన్, వార్డు సభ్యులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు, యువత, లబ్ధిదారులు పాల్గొనేలా చూడాలని తెలిపారు. అలాగే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏప్రిల్ 2న ఉదయం 10 గంటలకు పాఠశాలలు, పంచాయతీ భవనాలు లేదా అనుకూల వేదికలలో సభలు నిర్వహించాలని ఆదేశించారు. మైక్, స్పీకర్లు, ప్రొజెక్టర్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి వంటి పథకాల వివరాలు ప్రజలకు తెలియజేయాలని, లబ్ధిదారుల అనుభవాలను కూడా పంచుకోవాలని అన్నారు. అలాగే త్వరలో అమలు చేయనున్న అల్పాహార పథకం, కుటుంబ జీవిత భీమా, మధ్యాహ్న భోజన విస్తరణ, దివ్యాంగ విద్యార్థులకు వాహనాలు, సేంద్రీయ వ్యవసాయం వంటిఅంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం చూపుతున్న అధికారులను కలెక్టర్ అభినందించారు. త్వరలో మెగా గృహప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.

### రేవల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి ఏ సామాజిక వర్గానికి దక్కేనో..?

రేవల్లి: రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి వర్గ రాజకీయాలను ఒంటపట్టించుకొని, పార్టీ మనుగడ గాలికి వదలడంతో వర్గాల కుమ్ములాటలు 3 పూలు 6 కాయలుగా విరాజిల్లుతుంది. కాగా పార్టీ సాధారణ కార్యకర్త దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ప్రస్తుత మండల నాయకత్వం గత కొన్నినెలల క్రితమే రద్దవ్వగా, నూతన కమిటీలను ఎన్నుకునేందుకు కసరత్తును ప్రారంభించింది. పార్టీ నాయకత్వం, మండలంలోని ఆయా గ్రామాలలో అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ ముందుకు తీసుకెళ్లే నాయకత్వం ఏర్పడితేనే పార్టీ మళ్లీ పటిష్టంగా నిలబడే అవకాశం ఉంది. విభజన రాజకీయాలు పార్టీని మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. గత స్థానిక ఎన్నికలలో మండలంలోని 9 గ్రామపంచాయతీలకు గాను అందులో ఎస్సీలు ఇద్దరు, నలుగురు బీసీలు, ఒకరు ఎస్టీ.. కాంగ్రెస్ పార్టీ తరపున ఏడుగురు సర్పంచులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక ఓసీలు మరియు జనరల్ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యానికి అవకాశమే రాలేదు. ఇక పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉండదా? అంటూ ఈ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

# ఏటీఎం నగదు డ్రా చేస్తున్నారా?

# నేటి నుంచి ఈ మార్పులు తెలుసుకోండి



హైదరాబాద్:రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ నిబంధనల్లో పలు కీలక మార్పులు అమల్లోకి రాబోతున్నాయి. నగదు వినియోగాన్ని తగ్గించి, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్‌డీఎఫ్‌సీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) వంటి ప్రధాన బ్యాంకులు ఏటీఎం విత్‌డ్రా పరిమితులు, సేవా రుసుములను సవరించాయి.

ఉచిత పరిధిలోకి యూపీఐ విత్‌డ్రాలు: ఇప్పటివరకు ఏటీఎంలలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి యూపీఐ ద్వారా నగదు తీసుకునే సదుపాయంపై ప్రత్యేక ఛార్జీలు ఉండేవి కావు. అయితే ఏప్రిల్ 1 నుంచి ఈ విధానంలో మార్పు రానుంది. యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలను కూడా నెలవారీ ఉచిత ఏటీఎం లావాదేవీల కోటాలోనే చేర్చనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ వంటి బ్యాంకులు ప్రకటించాయి. ఖాతాదారులు తమకు నిర్దేశించిన ఉచిత పరిమితిని దాటితే, యూపీఐ ద్వారా చేసే ప్రతి విత్‌డ్రాపై రూ. 23తో పాటు అదనపు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా మెట్రో నగరాల్లో ఇతర బ్యాంక్ ఏటీఎంలలో 3, నాన్-మెట్రో నగరాల్లో 5 ఉచిత లావాదేవీలకు అవకాశం ఉన్న విషయం తెలిసిందే.

పీఎన్‌బీ విత్‌డ్రా లిమిట్‌లో భారీ కోత: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తమ డెబిట్ కార్డులపై రోజువారీ నగదు విత్‌డ్రా పరిమితిని భారీగా తగ్గించింది. ప్లాటినం, గోల్డ్, బిజినెస్ కార్డుల పరిమితిని రూ. 1,00,000 నుంచి రూ. 50,000కు తగ్గించారు. అదేవిధంగా, సెలెక్ట్, సిగ్నేచర్ కార్డుల పరిమితిని రూ. 1,50,000 నుంచి రూ. 75,000కు కుదించారు. అంటే, దాదాపు 50 శాతం మేర పరిమితుల్లో కోత విధించారు. మరోవైపు బంధన్ బ్యాంక్ కూడా పరిమితి మించిన లావాదేవీలపై రూ. 10 చొప్పున వసూలు చేయనున్నట్లు తెలిపింది.

భద్రత పెంపు, డిజిటల్ ప్రోత్సాహం: ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు ఓటీపీతో పాటు పిన్ లేదా బయోమెట్రిక్ వంటి రెండంచెల భద్రతను తప్పనిసరి చేశారు. నగదుపై ఆధారపడటాన్ని తగ్గించడం, బ్యాంకుల నిర్వహణ వ్యయాలను నియంత్రించడమే ఈ మార్పుల ముఖ్య ఉద్దేశమని బ్యాంకింగ్ వర్గాలు వివరిస్తున్నాయి. వినియోగదారులు మారిన నిబంధనలను గమనించి, అనవసర ఛార్జీల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నాయి.

# సినిమా

## వ్యోమగామిని కావాలనుకున్నా.. నాన్న కోసం నటిని అయ్యా



గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మాళవిక నాయర్ టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తక్కువ సినిమాలే చేసినా, ప్రతి పాత్రలోనూ తన ప్రతిభను చాటుతూ ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించారు. ప్రస్తుతం శర్వానంద్ సరసన బైకర్ చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఢిల్లీలో జన్మించి, కొచ్చిలో పెరిగిన మాళవికకు చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి ఎక్కువ. ముఖ్యంగా సైన్స్‌లో మంచి ప్రతిభ కనబరిచిన ఆమె, ఒకప్పుడు వ్యోమగామి కావాలని కలలు కనేవారట. చదువుతో పాటు స్విమ్మింగ్‌లో పతకాలు సాధించడంతో పాటు డాన్స్, డ్రాయింగ్ వంటి రంగాల్లోనూ శిక్షణ పొందారు. సినిమాల్లోకి ఆమె ప్రవేశం వెనుక తండ్రి శశి నాయర్ కీలక పాత్ర పోషించారు. తాను నటుడిగా మారాలన్న కోరిక నెరవేరకపోవడంతో, తన కుమార్తెను వెండితెరపై చూడాలని ఆశపడ్డారు. అలా మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన మాళవికకు దర్శకుడు నాగ్ అశ్విన్ 'ఎవడే సుబ్రహ్మణ్యం' కథను పంపించడంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమాలో 'ఆనంది' పాత్రతో మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత నాగశౌర్య సరసన నటించిన 'కల్యాణ వైభోగమే' చిత్రంతో ఫ్యామిలీ ఆడియన్స్‌కు మరింత దగ్గరయ్యారు. అలాగే మహానటిలో జమున పాత్రలో కనిపించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. 'టాక్సీవాలా', 'అన్ని మంచి శకునములే' వంటి చిత్రాల్లోనూ ఆమె చేసిన పాత్రలకు మంచి గుర్తింపు లభించింది. తన కెరీర్‌లో ఆసక్తికర అనుభవాలను కూడా ఆమె పంచుకున్నారు. 'విజేత' సినిమా సమయంలో స్కూటీ నడపడం రాకపోయినా, పాత్ర కోసం కష్టపడి నేర్చుకున్నట్లు తెలిపారు. రెండు మూడు సార్లు పడిపోయినా పట్టుదలతో సాధిం చానని చెప్పారు. అలాగే మలయాళంలో యాసిడ్ బాధితురాలిగా, తమిళంలో అంధురాలిగా నటించడం తనకు నటనలో కొత్త అనుభవాలను ఇచ్చిందన్నారు. ఇక ప్రస్తుతం శర్వానంద్ – అభిలాష్ రెడ్డి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'బైకర్'లో హీరోయిన్‌గా నటిస్తున్న మాళవిక, ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.


## సంజయ్ దత్ ఇండియన్ సినిమాకు 'గోల్డెన్ లెగ్'



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో బాక్సాఫీస్ రికార్డుల గురించి చర్చ మొదలైతే అందులో సౌత్ సూపర్‌స్టార్ల ఆధిపత్యమే ఎక్కువగా కనిపిస్తోంది. అయితే ఈ ట్రెండ్ మధ్య బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ దత్ సరికొత్త చరిత్ర సృష్టించారు. మూడు 1000 కోట్ల క్లబ్ చిత్రాల్లో నటించిన ఏకైక భారతీయ నటుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. సంజయ్ దత్ ఈ అరుదైన రికార్డును సాధించడంలో ఆయన ఎంపిక చేసిన విభిన్న పాత్రలే ప్రధాన కారణంగా నిలిచాయి. హీరోగానే కాకుండా విలన్, సపోర్టింగ్ రోల్స్, గెస్ట్ అప్పియరెన్స్‌లతోనూ భారీ విజయాల్లో భాగస్వామి కావడం ఆయన వెర్సటిలిటీకి నిదర్శనం. ఈ రికార్డు ప్రయాణం కెజిఎఫ్ చాప్టర్ 2తో ప్రారంభమైంది. యష్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో 'అధీర' పాత్రలో సంజయ్ దత్ నటనకు విశేష స్పందన లభించింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 1200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంజయ్ దత్‌కు పాన్ ఇండియా ఇమేజ్‌ను తెచ్చిపెట్టింది. ఆ తర్వాత షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ సినిమాలో గెస్ట్ రోల్‌లో కనిపించిన సంజయ్ దత్, మరో 1000 కోట్ల క్లబ్ చిత్రంలో భాగమయ్యారు. కొద్ది సేపే తెరపై కనిపించినప్పటికీ ఆయన పాత్రకు మంచి స్పందన వచ్చింది. ఇక దళపతి విజయ్ నటించిన లియోలో కీలక పాత్ర పోషించి మరో భారీ విజయాన్ని అందుకున్నారు. తాజాగా రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో వచ్చిన ధురంధర్ 2 1000 కోట్ల క్లబ్‌లో చేరడంతో సంజయ్ దత్ ఖాతాలో మూడో భారీ రికార్డు చేరింది. అయితే షారుఖ్ ఖాన్ 'పఠాన్', 'జవాన్' చిత్రాలతో రెండు 1000 కోట్ల క్లబ్ సినిమాలతో సత్తా చాటినప్పటికీ, మూడు సినిమాలతో సంజయ్ దత్ అగ్రస్థానంలో నిలిచారు. ఇదే సమయంలో రణ్‌వీర్ సింగ్ కూడా వరుసగా 'ధురంధర్', 'ధురంధర్ 2' చిత్రాలతో భారీ విజయాలు సాధిస్తూ తన స్థానాన్ని బలపరుచుకుంటున్నారు. ట్రేడ్ వర్గాల విశ్లేషణ ప్రకారం, పెద్ద హీరోల సినిమాల్లో సంజయ్ దత్ ఉండటం ఆ చిత్రాల హైప్‌ను మరింత పెంచుతోంది. తన ప్రత్యేకమైన వాయిస్, స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఆయన మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో మరింత బలంగా దూసుకెళ్తున్న సంజయ్ దత్, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలుచుకుంటూ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్నారు. ఆయన ప్రయాణం ఇప్పుడు యువ నటులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తోంది.


## మెగా డాటర్ నిహారిక కొణిదెల కౌంటర్ వైరల్


### ఎవరేమి అన్నా నా పని నేను చేస్తా



మెగా ఫ్యామిలీకి చెందిన నిహారిక కొణిదెల యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు నిర్మాతగా విజయవంతంగా దూసుకుపోతున్నారు. షార్ట్ ఫిల్మ్స్, వెబ్ సిరీస్‌లు, సినిమాలతో తనదైన ముద్ర వేసుకుంటున్న నిహారిక తాజాగా నిర్మించిన 'రాకాస' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఈ ఈవెంట్‌లో మాట్లాడిన నిహారిక కొణిదెల తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందించారు. నేను 'కమిటీ కుర్రాళ్ళు' సినిమా చేసినప్పుడు 15 మంది కొత్తవాళ్లను పరిచయం చేశాను. అప్పుడు ఎందుకు కొత్తవాళ్లతో చేస్తున్నావు, తెలిసిన వాళ్లతో చేయొచ్చుకదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' చేస్తుంటే మళ్లీ అదే తరహా సినిమా చేయొచ్చుకదా, ఈ విజువల్ ఎఫెక్ట్స్ సినిమా ఎందుకు అంటున్నారు అని తెలిపారు. ఇదే సమయంలో, తాను తదుపరి చిత్రంగా వరుణ్ తేజ్‌తో సినిమా చేస్తుంటే కూడా విమర్శలు వస్తున్నాయని వెల్లడించారు. చిన్నవాళ్లతో చేయొచ్చుకదా, ఫ్యామిలీ వాళ్లతో ఎందుకు చేస్తున్నావు అంటున్నారు. నేనేం చేసినా నన్ను అనేవాళ్లు ఉంటారు. నేను చేయాల్సింది చేస్తూనే ఉంటా అని స్పష్టం చేశారు. నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే యూట్యూబ్, ఓటీటీ వేదికలపై పలువురు ప్రశంసలు అందుకున్న ప్రాజెక్టులు అందించారు. ముఖ్యంగా 'కమిటీ కుర్రాళ్ళు' సినిమాతో మంచి విజయాన్ని సాధించారు. ఇప్పుడు ఆమె నిర్మాణంలో తెరకెక్కిన 'రాకాస' సినిమా ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. విభిన్న కథాంశంతో, విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. 'రాకాస' తర్వాత వరుణ్ తేజ్‌తో 'బరి' అనే మరో ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో తెరకెక్కించేందుకు నిహారిక సిద్ధమవుతున్నారు. నిర్మాతగా ఆమె ఎంపికలు, ధైర్యమైన నిర్ణయాలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. తనపై వస్తున్న విమర్శలకు నిహారిక ఇచ్చిన స్ట్రాంగ్ కౌంటర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాను ఎంచుకున్న మార్గంలో ముందుకు సాగుతానన్న ఆమె స్పష్టత అభిమానులను ఆకట్టుకుంటోంది.

## 'పెద్ది' మళ్లీ వాయిదా?





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'గేమ్ ఛేంజర్' తర్వాత వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మెగా ఫ్యాన్స్ ఆశలు పెట్టుకున్నారు. గ్రామీణ క్రీడల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. 'ఉప్పెన' సినిమాతో సెన్సేషన్ హిట్ అందుకున్న బుచ్చిబాబు, కొంత గ్యాప్ తర్వాత 'పెద్ది'తో ప్రేక్షకుల ముందుకు రానుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, సాంగ్స్ ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఇందులో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనుండటం అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. మొదటగా ఈ సినిమాను మార్చి 27న, అంటే రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే అనివార్య కారణాలతో రిలీజ్‌ను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. ఇప్పుడు మరోసారి ఈ సినిమా వాయిదా పడే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఓ మూవీ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ 'పెద్ది' కొత్త విడుదల తేదీని జూన్ 26 కి ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించాడు.'మా సినిమాను జూన్ 26న రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ ఆ తేదీన 'పెద్ది' మూవీ రిలీజ్ కాబోతోంది' అని ఎస్కేఎన్ చెప్పడంతో మెగా అభిమానులలో ఆందోళన వ్యక్తం అవుతుంది. సినిమా షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడం మూవీ వాయిదా పడడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా ఒక ఐటమ్ సాంగ్‌తో పాటు మరో పాట చిత్రీకరణ పెండింగ్‌లో ఉ ందని సమాచారం. మరోవైపు ఇటీవల రామ్ చరణ్ కంటికి గాయం కావడం కూడా షూటింగ్ ఆలస్యానికి కారణమైంది. ఈ నేపథ్యంలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రమోషన్స్ అన్ని పూర్తి చేయడానికి మరింత సమయం అవసరమవుతుందని తెలుస్తోంది.

'పెద్ది' రిలీజ్ డేట్ మార్పు ఇతర సినిమాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అఖిల్ అక్కినేని నటిస్తున్న 'లెనిన్' సినిమా జూన్ 26న విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే 'పెద్ది' అదే సమయంలో వస్తే, ఆ చిత్రం మే 1కి షిఫ్ట్ అయ్యే అవకాశం ఉందని టాక్. ఇక నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న 'స్వయంభు', అలాగే తరుణ్ భాస్కర్ రూపొందిస్తున్న 'గాయపడ్డ సింహం' సినిమా కూడా 'పెద్ది' తర్వాత రిలీజ్ కోసం సిద్ధంగా ఉన్నాయి. మరోసారి వాయిదా పడుతుందనే వార్తలు మెగా అభిమానుల్లో నిరాశ కలిగిస్తున్నప్పటికీ, సినిమా క్వాలిటీ కోసం సమయం తీసుకోవడం మంచిదేనని కొందరు భావిస్తున్నారు.



## ఓటీటీలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని




శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేడని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343